ప్రజాశక్తి

ఆదివారం 22 జూన్ 2025

8 పేజీలు



విశాఖపట్నం



అనకాపల్లి

తీరంలో యోగా సంబరం

- ఒకే వేదికపై 3 లక్షల పైచిలుకు మంది ఆసనాలు
- 22,122 మంది గిరి విద్యార్థులు ఏకకాలంలో సూర్యనమస్కారాలు
- రాష్ట్రానికి రెండు గిన్నిస్ రికార్డులు
- శారీరక, మానసిక ఆరోగ్యానికి యోగా మార్గం : మోడీ, చంద్రబాబు



బీచ్ రోడ్డులో యోగాసనాలు వేస్తున్న జనం

ప్రజాశక్తి - ఎంవిపి.కాలనీ

విశాఖ సాగర తీరం అంతర్జాతీయ యోగా సంబరానికి శనివారం వేదికైంది. ఆర్‌కె బీచ్ నుంచి భోగాపురం వరకూ ఒకే వేదికగా 3,03,654 మంది యోగాసనాలు వేసినట్టు రాష్ట్ర ప్రభుత్వం ప్రకటించింది. అదే క్రమంలో రెండో రోజూ 22,122 మంది గిరి విద్యార్థులు సామూహికంగా ఎయు వేదికగా 108 సూర్యనమస్కారాలు చేపట్టారు. ఇవి రెండూ గిన్నిస్ బుక్‌లోకి ఎక్కాయి. ఈ మేరకు గిన్నిస్ బుక్ నిర్వాహకులు ధ్రువపత్రాలను రాష్ట్ర ప్రభుత్వానికి అందించారు.

విశాఖ సాగర తీరంలో శనివారం ఉదయం జరిగిన అంతర్జాతీయ యోగా దినోత్సవ వేడుకల కోసం వేకువనే ప్రధాని మోడీ, సిఎం మిగతా 2లో..



ప్రధాన వేదిక వద్ద ఆసనాలు వేస్తున్న మోడీ, చంద్రబాబు



బాధ్యతలు స్వీకరిస్తున్న కేతన్ గార్గ్

పారిశుధ్యానికి, సుందరీకరణకు తొలి ప్రాధాన్యత

జివిఎంసి కమిషనర్‌గా బాధ్యతలు చేపట్టిన కేతన్ గార్గ్

వార్త 8లో..

మొదటి పేజీ తరువాయి..



మాట్లాడుతున్న ప్రధాని మోడీ

తీరంలో యోగా సంబరం

చంద్రబాబు ప్రభృతులు చేరుకున్నారు. ఆసనాలు వేశారు. యోగా స్మారక పోస్టల్ స్టాంప్‌ను వేదికపై విడుదల చేశారు. ఈ సందర్భంగా ప్రధాని మాట్లాడుతూ యోగా ప్రపంచ దేశాలను ఏకం చేసిందన్నారు. నేడు ప్రపంచంలో అశాంతి పెరిగిన నేపథ్యంలో యోగా అందరికీ అవసరమన్నారు. దీన్ని దేశ ప్రజలందరి చెంతకు చేరుస్తామన్నారు. సిఎం చంద్రబాబు మాట్లాడుతూ యోగా ప్రజల జీవన విధానం కావాలన్నారు. యోగాతో శారీరక, మానసిక ఆరోగ్యం లభిస్తుందని తెలిపారు. యోగాతో రోగనిరోధక శక్తిని పెంపొందించుకోవచ్చునన్నారు. యోగా హింసను తగ్గించి శాంతిని ప్రోత్సహిస్తుందని తెలిపారు. యోగా దినోత్సవాన్ని విజయవంతం చేయడానికి మంత్రులంతా బాగా పనిచేశారని ప్రశంసించారు. సూర్యనమస్కారాలతో గిన్నిస్ రికార్డు సాధించిన గిరిజన విద్యార్థులను అభినందించారు. రాష్ట్రంలోని ప్రజల ఆరోగ్యానికి సంబంధించి డిజిటల్ హెల్త్ రికార్డులు తయారు చేస్తున్నామన్నారు. యోగా, నేచురోపతి గేమ్ ఛేంజర్ అవుతుందని తెలిపారు. ఎపిలో నెల రోజుల పాటు నిర్వహించిన కార్యక్రమాల గురించి ప్రస్తావించారు. యోగాంధ్ర కార్యక్రమం ట్రెండ్ సెట్టర్‌గా నిలిచిందని తెలిపారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన ప్రధాని నరేంద్ర మోడీని డిప్యూటీ సిఎం పవన్ కల్యాణ్‌తో కలిసి కలంకారీ శాలువాతో సన్మానించి, లక్ష్మీ నరసింహస్వామి జ్ఞాపికను అందజేశారు. యోగా ప్రధాన వేదికపై కేంద్ర ఆయుష్ శాఖ మంత్రి ప్రతాప్‌రావ్ జాదవ్, గవర్నర్ అబ్దుల్ నజీర్, కేంద్ర మంత్రులు కె.రామ్మోహననాయుడు, పెమ్మసాని చంద్రశేఖర్, శ్రీనివాసవర్మ, రాష్ట్ర మంత్రులు లోకేష్, ఎంపీ పురంధరేశ్వరి, శ్రీభరత్ ఉన్నారు. మంత్రులు వంగలపూడి అనిత, గుమ్మడి సంధ్యారాణి, అచ్చెన్నాయుడు, కొండపల్లి శ్రీనివాస్, ఎమ్మెల్యేలు వంశీకృష్ణ శ్రీనివాస్ యాదవ్, సుందరపు విజయ్‌కుమార్, గణబాబు, విష్ణుకుమార్‌రాజు తదితరులు పాల్గొన్నారు.

యోగా దారిన మోడీ భజన !

ప్రజాశక్తి - గ్రేటర్ విశాఖ బ్యూరో

విశాఖ సాగర తీరంలో 'యోగా' దారిన మోడీని రాష్ట్రంలోని రెండు ప్రధాన పార్టీలు భజన కీర్తనలతో ముంచెత్తాయి. తెలుగుదేశం అధినేత, రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, జనసేన అధినేత, ఉపముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ ఇద్దరూ ఒకరి తర్వాత ఒకరు ప్రధానిపై పోటాపోటీగా ప్రశంసలు కురిపించారు. విభజన హామీలను నెరవేర్చకపోయినా, విశాఖ ఉక్కుపై ప్రధాని మాట్లాడకపోయినా ఇలా భజన చేయడంపై నగరంలో చర్చ సాగింది. అసలు యోగాను రోజువారీ జీవితంలో భాగం చేసుకోకపోతే మానవాళి ఎదుర్కొంటున్న అన్ని రకాల సమస్యల నుంచి, ఒత్తిడి, అశాంతి, సామాజిక రుగ్మతల నుంచి ఎవ్వరూ బయటపడలేరన్న రీతిలో ఈ నేతల ప్రసంగాలు సాగాయి. యోగాను విశ్వవాపితం చేసి 'విశ్వగురువు'గా మోడీ ఉన్నారని చెప్పడానికి శనివారం విశాఖ సాగర తీరంలో కాళీమాత గుడి సాక్షిగా ముఖ్యమంత్రి చంద్రబాబు, ఉప ముఖ్యమంత్రి పవన్ పడరాని పాట్లు పడ్డారంటే ఆశ్చర్యం కలుగక మానదు. ఇంతవరకూ ఏదో తప్పు జరిగిపోయిందని ప్రజలు భావించేలాగ వీరిద్దరి ఉపన్యాసాలు సాగాయి. యోగా డే సభావేదికపై నేతల ప్రసంగాల సమయంలోనూ, యోగా విన్యాసాలు పూర్తయ్యాక పెద్ద ఎత్తున అక్కడకు చేరిన కొంతమందితో కూడిన కాషాయ మూకలు భారత్‌మాతాకీ జై అంటూ సాగర తీరంలో నినాదాలు చేస్తూ హల్‌చల్ చేశాయి.

యోగా అంటే ఇదే భారతీయత, ఇదే సంస్కృతి, ఇదే అన్ని సమస్యలకూ పరిష్కారం అని చంద్రబాబు చెబుతూ యోగాకు ఆదిగురువు మోడీ అంటూ వేదికపై కితాబిచ్చారు.. హిందూ సంస్కృతి, సంప్రదాయం యోగా అని విశాఖలోని మధ్యతరగతి ప్రజానీకాన్నే కాదు బస్సుల్లో వేల సంఖ్యలో తరలించబడ్డ గ్రామీణ జనాన్ని సైతం నమ్మించే ప్రయత్నం చేశారు. ఈ పరిణామం పట్ల



అభ్యుదయవాదులు ఒకింత ఆందోళనకు గురయ్యారు.

రూ.150 కోట్ల ఖర్చు..

నెలరోజుల పాటు ప్రచారం

రాష్ట్రం నలుమూలలు, ఉమ్మడి ఉత్తరాంధ్ర జిల్లాలు, గిరిజన ప్రాంతాల నుంచి ఈ యోగా వేడుకల్లో పాల్గొనేందుకు లక్షల సంఖ్యలో ప్రజానీకాన్ని ప్రభుత్వ బస్సులు, ప్రైవేట్ వాహనాల్లో తరలించడం తెలిసిందే. దీనికోసమని నెల రోజులుగా రూ.150 కోట్లను మంచినీళ్ల ప్రాయంగా రాష్ట్ర ప్రభుత్వం, విశాఖ జిల్లా అధికార యంత్రాంగం ఖర్చుచేస్తూ ప్రచారాన్ని నిర్వహించిన విషయం విదితమే. పేదరికం, నిరుద్యోగం వంటి సమస్యలకు పరిష్కారం చూపకుండా డైవర్షన్ యోగాకు దిగారు. మొత్తానికి యోగా ముసుగు వేసుకుని రాష్ట్రంలో కూటమి పార్టీల నేతలు తమ బలబలాలను పెంచుకోడానికి 'రాజకీయం'గా సాగరతీర అంతర్జాతీయ యోగా'ను వాడుకున్నారా ? అనే అనుమానాలు వ్యక్తమవుతున్నాయి.

కొసమెరుపు

యోగా డేను అనుకున్నట్టుగా 3 లక్షల మందితో దిగ్విజయం చేసినందుకు ప్రధాని నరేంద్రమోడీ వేదికపై మంత్రి లోకేష్ భుజం తట్టారని, తమ అధినేత పవన్‌కు ఈ సభలో పెద్ద ప్రాధాన్యం లభించలేదని జనసేన ఎంఎల్‌ఏలు, నాయకులు, కార్యకర్తలందరిలోనూ శనివారం యోగా విన్యాసాలనంతరం చర్చ జరగడం కనిపించింది.

యోగాడే దృశ్యమాలిక

విశాఖ సాగరతీరం వెంబడి శనివారం అంతర్జాతీయ యోగా దినోత్సవ వేడుకలు ఘనంగా జరిగాయి. ప్రధాని మోడీ, సిఎం చంద్రబాబు సహా పలువురు ప్రముఖులు హాజరయ్యారు. విద్యార్థుల యోగా విన్యాసాలు ఆకట్టుకున్నాయి. ఆర్‌కె బీచ్ నుంచి భోగాపురం వరకూ జనమే కనిపించారు. పలుచోట్ల ట్రాఫిక్ అంతరాయం కలిగింది.



ప్రధాని మోడీకి స్వాగతం పలుకుతున్న సిఎం చంద్రబాబు, గవర్నర్ అబ్దుల్ నజీర్



గిన్నిస్ రికార్డు ధ్రువపత్రాలతో మంత్రులు



ఎయులో యోగాసనాలు వేసిన గిరిజన విద్యార్థులు



యోగా వేడుకల్లో పాల్గొన్న విదేశీయులు

నిబంధనలు పట్టవా?



- పలు హోటళ్లు, రెస్టారెంట్లలో కనిపించని ధరల పట్టికలు
- శుభ్రతకు తిలోదకాలు

ప్రజాశక్తి- ఆనందపురం : ఇటీవల కాలంలో ప్రజలు విందు, విహారాలకు అధిక ప్రాధాన్యత ఇస్తున్నారు. దీంతో హోటళ్ల, రెస్టారెంట్లపై ఆధారపడే వారి సంఖ్య రోజురోజుకూ పెరుగుతోంది. ఈ పెరుగుతున్న డిమాండ్‌తో హోటళ్ల నిర్వాహకులు నిబంధనలను పక్కన పెట్టి దోపిడీకి పాల్పడుతున్నారు. శుచి, శుభ్రత లేని వాతావరణం, తక్కువ నాణ్యత గల పదార్థాల వినియోగంతో ప్రజల ఆరోగ్యాన్ని ప్రమాదంలో పడేస్తున్నారు. ఆనందపురం మండలంలో పలు హోటళ్ల డాబాలు, బేకరీలు, అనేక టిఫిన్ షాపులు నిర్వహిస్తున్నారు.

హోటళ్లలో ఎక్కడా స్పష్టమైన ధరల పట్టికలు కనపడటం లేదు. వినియోగదారులకు ఏ పదార్థానికి ఎంత ధర అనేది ముందుగా తెలీదు. తిన్న తరువాత నిర్వాహకులు చెప్పినదే చెల్లించాల్సిన పరిస్థితి ఉంటుంది. బిల్లులు ఇవ్వక పోవడం వల్ల ప్రభుత్వ ఆదాయానికి గండి పడుతోంది. వాణిజ్య, జిఎస్‌టి తదితర పన్నుల నుంచి తప్పించుకుంటున్నారు.

నాణ్యతలో నిర్లక్ష్యం

తక్కువ ధరకు దొరికే పదార్థాలు, పాత నూనెలను వినియోగిస్తునానరు. మాంసం సరఫరాలో పశు సంవర్ధక శాఖ ధ్రువీకరణ లేని సరుకు వినియోగించడం, గ్యాస్ వినియోగంలోనూ నిబంధనలు ఉల్లంఘించడం వంటి అంశాలు పెద్దస్థాయిలో జరుగుతున్నాయి.

పర్యవేక్షణ లేమి

మండలంలో అధిక సంఖ్యలో ఉన్న చిన్న, పెద్ద హోటళ్లపై పర్యవేక్షణ కానరావడంలేదు. ఆహార భద్రతా అధికారులు నెలకోసారి అయినా తనిఖీలు నిర్వహించినట్లు రికార్డులు లేవు. రెవెన్యూ, పోలీస్ అధికారులు సైతం నిర్లక్ష్యం చూపుతున్నారు. నిరంతర తనిఖీలు జరిగితేనే దోపిడీకి అడ్డుకట్టు పడుతుంది.

పెద్ద హోటళ్లలో సైతం టాయిలెట్లు, పార్కింగ్, బేబీ ఫీడింగ్ రూమ్ లాంటి మౌలిక సదుపాయాలు లేవు. అయినప్పటికీ మెనూలోని ధరలు మహానగరాల మాదిరిగా ఉన్నాయని వినియోగదారులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఒక కూరగాయ భోజనానికి రూ.150, మాంసాహార భోజనాలకు భారీగా ధరలు వసూలు చేస్తున్నారు. సంబంధిత శాఖలు తక్షణమే స్పందించి హోటళ్లను నిబంధనల కిందకు తీసుకురావాలని, ధరల పట్టికలు, బిల్లుల జారీ, శుభ్రత ప్రమాణాలు పాటించేలా చూడాలని, ప్రభుత్వ ఆదాయాన్ని కాపాడే విధంగా చర్యలు తీసుకోవాలని పలువురు కోరుతున్నారు.

నేరాలు ఘోరాలు

చోరీలకు పాల్పడుతున్న ముగ్గురు అరెస్టు




ప్రజాశక్తి -గాజువాక : వాహనాల డిక్కీల్లో దొంగతనాలు పాల్పడుతున్న ముగ్గురు అంతర్రాష్ట్ర నిందితులను పట్టుకొని అరెస్టు చేసినట్లు గాజువాక క్రైమ్ ఎస్ఐ ఎ.మన్మధరావు తెలిపారు. ఉత్తరప్రదేశ్ రాష్ట్ర, ఘజియాబాద్‌కు చెందిన ప్రిన్స్ కుమార్ (28), క్రిషన్ (22), ధర్మేంద్ర కుమార్ (26) చెడు అలవాట్లకు బానిసై సులభంగా డబ్బులు సంపాదించాలని గతంలో వివిధ రాష్ట్రాల్లో డిక్కీ దొంగతనాలు పాల్పడినట్లు తెలిపారు. ఆ విధంగా నగర పరిధిలో గాజువాక, పెందుర్తి, ఎయిర్‌పోర్టు, ఆరిలోవ స్టేషన్ పరిధిలో డిక్కీ కేసు నమోదయ్యాని పేర్కొన్నారు. ఈ నెల 14వ తేదీన దేగల లలిత శీలానగర్‌లో ఒక పరీక్ష రాసేందుకు వచ్చి స్కూటర్‌ను బయట ఉంచారని తెలిపారు. పరీక్ష రాసి వచ్చిన ఆమె డిక్కీ తెరవగా విలువైన వస్తువులు చోరీ జరిగినట్లు గురించి గాజువాక క్రైమ్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఆ ఫిర్యాదు మేరకు దర్యాప్తు చేస్తుండగా ఈ నెల 20వ తేదీన రాత్రి 6:30 గంటలకు శీలానగర్‌లో అనుమానాస్పదంగా తిరుగుతున్న ముగ్గురిని పట్టుకొని విచారించారు. నేరాన్ని వారు అంగీకరించినట్లు తెలిపారు. వారి నుంచి 12 గిఫ్ట్ ఓచర్లు, రెండు మొబైల్ ఫోన్లు, ఆరు సిమ్ కార్డులు స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. చోరీ సొత్తు విలువ రూ.6,28,500 అని పేర్కొన్నారు.

రోడ్డు ప్రమాదంలో ఆటో డ్రైవర్ మృతి

ప్రజాశక్తి- తగరపువలస : స్థానిక సర్వీస్ రోడ్డు విద్యుత్ సబ్ స్టేషన్ సమీపంలో శనివారం జరిగిన రోడ్డు ప్రమాదంలో స్థానిక బాలాజీనగర్‌కు చెందిన ఆటో డ్రైవర్ నమ్మి రాము (30) తీవ్ర గాయాలై మృతి చెందాడు. పోలీసులు, స్థానికుల కథనం ప్రకారం.. తగరపువలస నుంచి సర్వీస్ రోడ్డు మార్గంలో సంగివలస వైపు వెళ్తున్న వాటర్ ట్యాంకర్, ఎదురుగా వస్తున్న ఆటోను బలంగా ఢీ కొంది. ఈ ప్రమాదంలో ఆటో డ్రైవర్ రాముకు తీవ్ర గాయాలయ్యాయి. అతన్ని స్థానికులు సంగివలస ఎన్ఆర్ఐ ఆసుపత్రికి తీసుకెళ్లారు. అప్పటికే అతను మృతి చెందినట్లు వైద్యులు తెలిపారు. మృతునికి భార్య, ఇద్దరు పిల్లలు ఉన్నారు. మృతదేహాన్ని పోస్టు మార్టం నిమిత్తం భీమిలి ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. వాటర్ ట్యాంకర్ బ్రేకులు ఫెయిల్ అవ్వడంతో అదుపు తప్పి ఆటోను ఢీకొన్నట్లు కొందరు చెబుతున్నారు.

రేపు నీటి సరఫరాకు అంతరాయం

ప్రజాశక్తి - గాజువాక : జివిఎంసి గాజువాక జోన్ 6 పరిధి సుందరయ్యకాలనీలోని 10 ఎంఎల్‌డి మంచినీటి శుద్ధి కర్మాగారం పైపులైన్లు, మోటార్ల మరమ్మత్తులు కారణంగా 70, 71, 72, 73, 74, 76, 64, 65వ వార్డులకు ఈ నెల 23న నీటి సరఫరాకు అంతరాయం ఏర్పడుతుందని జివిఎంసి నీటి సరఫరా విభాగం అధికారులు తెలిపారు. ప్రజలు గమనించి సహకరించాలని కోరారు.



ఆర్థిక సాయం చేస్తున్న ఇల్లపు రాము

పేద విద్యార్థికి ఆర్థిక సహాయం

ప్రజాశక్తి -గాజువాక : జివిఎంసి 87వ వార్డు పరిధి కణితి పద్మశాలి వీధికి చెందిన వైసిపి మహిళా కార్యకర్త కాకి రమ కుమారుడు ధనుష్ స్కూల్ ఫీజు నిమిత్తం ఆ పార్టీ నాయకులు ఇల్లపు రాము శనివారం ఆర్థిక సాయం చేశారు. ఈ సందర్భంగా ఇల్లపు రాము మాట్లాడుతూ, వైసిపి కార్యకర్తలకు ఎటువంటి సమస్య వచ్చినా తన వంతు సాయం చేస్తానని చెప్పారు. ఈ కార్యక్రమంలో సీనియర్ నాయకులు ముద్దపు దామోదర్, దుగ్గపు దానప్పలు, కర్రి నాగేశ్వరావు, గుంట్ల శ్రీను, అంజి, కృష్ణ, బి.ప్రసాద్, మార్పు గోవింద్ పాల్గొన్నారు.

'యువత పోరు' పోస్టర్ ఆవిష్కరణ



పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న వాసుపల్లి గణేష్‌కుమార్ తదితరులు

ప్రజాశక్తి- విశాఖ కలెక్టరేట్ : వైసిపి అధినేత, మాజీ ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డి ఇచ్చిన పిలుపుమేరకు ఈ నెల 23వ తేదీన జరగనున్న యువత పోరును విజయవంతం చేయాలని దక్షిణ నియోజకవర్గ వైసిపి కేడర్‌కు మాజీ ఎమ్మెల్యే వాసుపల్లి గణేష్ కుమార్ పిలుపునిచ్చారు. ఆశీలుమెట్ట కార్యాలయంలో యువత పోరు పోస్టర్‌ను శనివారం ఆయన ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వాసుపల్లి మాట్లాడుతూ, చంద్రబాబు అబద్ధాల పుట్ట అని మరోకసారి రుజువు అయిందన్నారు. సూపర్ సిక్స్ హామీల్లో ముఖ్యంగా యువతకిచ్చిన హామీలు గాలికి వదిలేసారన్నారు. ఉన్న ఉద్యోగాలను తొలగించి లక్షల మంది వాలంటీర్లను రోడ్డుపాలు చేశారన్నారు. రూ.3 వేలు నిరుద్యోగ భృతి ఇస్తామని ఏడాది గడిచినా ఆ ఊసే లేదని తెలిపారు. వైసిపి అధికారంలో ఉన్నప్పుడు ఒక్క రూపాయి లంచం లేకుండా రెండున్నర లక్షల కోట్ల రూపాయలను ప్రజల ఖాతాల్లోకి చేరవేసిందన్నారు. అంతకుమించి ఇస్తామని పేద ప్రజలకు ఆశ చూపి గద్దెనెక్కిన చంద్రబాబు తన వక్ర బుద్ధిని మరొకసారి చూపారని విమర్శించారు. పవన్ కల్యాణ్ కేవలం పోస్టర్లకు మాత్రమే పరిమితమయ్యారని పేర్కొన్నారు. యువతకిచ్చిన హామీలు తక్షణమే అమలు చేయాలని, లేనిపక్షంలో వైసిపి పోరాటం ఉధృతం చేస్తుందని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో 34వ వార్డు కార్పొరేటర్ తోట పద్మావతి, 31వ వార్డు కార్పొరేటర్ బిపిన్ కుమార్‌జైన్, పార్టీ రాష్ట్ర మహిళా విభాగం కార్యదర్శి రీసు అనురాధ, సంయుక్త కార్యదర్శి బోరా విజయలక్ష్మి, వసరళ సుబ్రహ్మణ్యం, పార్టీ వివిధ వార్డుల అధ్యక్షులు పాల్గొన్నారు.

యోగా అనంతరం తాగు నీరు సరఫరా

ప్రజాశక్తి -భీమునిపట్నం : అంతర్జాతీయ యోగా దినోత్సవంలో అన్ని వర్గాల ప్రజలు పాల్గొన్న నేపథ్యంలో జివిఎంసి తాగు నీటి సరఫరా వేళల్లో స్వల్ప మార్పులు చేసింది. యోగా డే లో పాల్గొన్న వారంతా ఇళ్లకు చేరుకున్నాక జివిఎంసి ఒకటో జోన్ పరిధిలో శనివారం ఉదయం 11 గంటలకు కుళాయిల ద్వారా తాగు నీరు సరఫరా చేశారు. ఇందుకు గాను మహిళలు సంతోషం వ్యక్తం చేశారు.



కుళాయి వద్ద నీరు పట్టుకుంటున్న మహిళలు

బస్సుల్లో నిద్ర.. ఆకలి కేకలు.. ఇదేనా యోగాంధ్ర ?

ప్రజాశక్తి- విశాఖ కలెక్టరేట్ : కనీస సౌకర్యాలు కల్పించకుండా గిరిజన విద్యార్థులను బస్సుల్లో, మైదానంలో పడుకోబెట్టడం, సరైన తిండి పెట్టకుండా ఆకలితో అలమటించేలా చేయడమేనా యోగాంధ్రా అని పిడిఎస్ఒ, ఎఐఎస్ఎఫ్ నాయకులు ప్రశ్నించారు. అంతర్జాతీయ యోగా దినోత్సవం (యోగాంధ్ర 2025) సందర్భంగా అల్లూరి సీతారామరాజు జిల్లా అరకు, లంబసింగి వంటి గిరిజన ప్రాంతాల నుంచి 25 వేల మంది విద్యార్థులను కనీస సౌకర్యాలు లేకుండా తరలించిన ప్రభుత్వం యొక్క దారుణ నిర్లక్ష్యాన్ని పిడిఎస్ఒ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎ.సురేష్, ఎఐఎస్ఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి ఉల్లం నాగరాజు వేర్వేరు ప్రకటనల్లో తీవ్రంగా ఖండించారు. గిన్నిస్ రికార్డు కోసం 108 సూర్యనమస్కారాలు చేయించేందుకు ఈ విద్యార్థులను శుక్రవారం తెల్లవారుజామున ప్రత్యేక బస్సుల్లో ఎయు ఇంజినీరింగ్ కాలేజీ గ్రౌండ్‌కు తీసుకొచ్చారని, సరైన ఆహారం, తాగునీరు, మరుగుదొడ్లు, వసతి సౌకర్యాలు లేక విద్యార్థులు తీవ్ర ఇబ్బందులు పడ్డారని తెలిపారు. శుక్రవారం రాత్రి భోజనాలు సరిపోక, ఆకలితో అలమటించిన చిన్నారులు హాహాకారాలు చేశారని పేర్కొన్నారు. వసతి ఏర్పాట్లు లేక వందల మంది మైదానాల్లో, బస్సుల్లో నిద్రించారని తెలిపారు. రోడ్డుపై భోజనాలు తీసుకోవాల్సిన దుస్థితి, క్యూలైన్లలో గంటల తరబడి నీరు, భోజనం కోసం వేచి ఉండాల్సిన అవస్థ ఏర్పడిందని వివరించారు. ఈ అమానవీయ చర్య ప్రభుత్వ బాధ్యతారాహిత్యం, గిరిజన విద్యార్థుల పట్ల నిర్లక్ష్య ధోరణిని స్పష్టం చేస్తోందని ఆరోపించారు.

ప్రధాని మోదీ, ముఖ్యమంత్రి చంద్రబాబు, కేంద్ర-రాష్ట్ర మంత్రులతో పాటు ఉన్నతాధికారులు మూడు రోజుల ముందుగానే విశాఖపట్నంలో ఉండి కార్యక్రమ ఏర్పాట్లలో నిమగ్నమైనప్పటికీ, విద్యార్థుల పరిస్థితిని పట్టించుకోలేదని విమర్శించారు. శుక్రవారం మధ్యాహ్నం 12 గంటలకు గ్రౌండ్‌కు చేరిన విద్యార్థులకు సరైన సౌకర్యాలు లేక, మధ్యాహ్నం 3:30కు ప్రారంభం కావాల్సిన యోగాసనాల కార్యక్రమం ఆలస్యమై, సాయంత్రం 4:45కు 108 నిమిషాల పాటు సూర్యనమస్కారాలు చేయించారని తెలిపారు. రాత్రి 8 గంటల వరకు గ్రౌండ్‌లోనే ఉంచిన విద్యార్థులకు సరిపడా భోజనం అందక, ఆకలితో ఇబ్బంది పడ్డారని తెలిపారు. గిన్నిస్ రికార్డుల కోసం గిరిజన విద్యార్థులను తీవ్ర ఇబ్బందులకు గురిచేసిన ప్రభుత్వ చర్యలను ఖండిస్తూ విద్యార్థుల తరలింపులో ప్రభుత్వ నిర్లక్ష్యంపై స్వతంత్ర విచారణ జరపాలని, బాధ్యులైన అధికారులపై కఠిన చర్యలు తీసుకోవాలని, విద్యార్థులను ప్రభుత్వ ప్రచార ఉత్సవాల కోసం ఉపయోగించరాదనే కఠిన నిబంధనలు రూపొందించాలని వారు డిమాండ్ చేశారు.

ఉత్సాహంగా యోగా



విసెజ్‌లో యోగాసనాలు వేస్తున్న సిబ్బంది

ప్రజాశక్తి-యంత్రాంగం

భీమునిపట్నం బీచ్ రోడ్డు తిమ్మాపురం మొదలు నేరెళ్లవలస, మార్లిన్ కే హోటల్ వరకు ఏర్పాటుచేసిన కంపార్ట్‌మెంట్ల వద్ద శనివారం ఉదయం 6.30 నుంచి 8.30 వరకు యోగాసనాలు వేశారు. బస్సుల్లో తీసుకెళ్లేటప్పుడు కనీసం తాగు నీటి బాటిళ్లు ఇవ్వలేదని కొందరు అవేదన వ్యక్తం చేశారు. యోగా పూర్తయ్యాక యోగా మ్యాట్, వాటర్ బాటిల్, ఫుడ్ ప్యాకెట్‌లు అందలేదని పలువురు నిరాశతో వెనుతిరగడం కనిపించింది. పలు పాఠశాలల్లో విద్యార్థులచే యోగాసనాలు వేయించారు. భీమిలి మండలం, చిప్పాడ దివీస్‌లో 1150 మంది ఉద్యోగులు యోగాసనాలు వేశారు. సంస్థ డైరెక్టర్ ఎస్ దేవేందర్‌రావు మాట్లాడారు. భీమిలి ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జి కోర్టు ఆవరణలో జడ్జిలు, న్యాయవాదులు యోగాసనాలు వేశారు. మధురవాడ శ్రీరామ ప్రోపర్టీరోడ్డులో ఏర్పాటుచేసిన యోగాసనాల్లో భీమిలి ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావు పాల్గొన్నారు. సీతమ్మధార రైతు బజార్‌లో యోగాసనాలు వేశారు. విశాఖ కేంద్ర కారాగారంలో ఖైదీలు, జైలు సిబ్బంది ఇండియా మ్యాప్ ఆకారంలో యోగాసనాలు వేశారు. ఈ కార్యక్రమంలో పర్యవేక్షణాధికారి మహేష్ బాబు పాల్గొన్నారు. ఆంధ్రప్రదేశ్, తెలంగాణ రాష్ట్రాలలో ఉన్న పద్మ పూజిత వీల్స్ మార్ట్ సంస్థలోని 350 మందికి పైగాఉద్యోగస్తులు యోగాసనాలు వేశారు. సింహాచలం దేవస్థానం పరిపాలన భవనం ప్రాంగణంలో యోగా దినోత్సవాన్ని నిర్వహించారు. ఆనందపురం మండలంలోని 18 సచివాలయాలు, 26 పంచాయతీల నుండి సుమారు 8 వేల మందికి పైగా ప్రజలు యోగాలో పాల్గొన్నారు. వి సెజ్‌లో నిర్వహించిన యోగా వేడుకల్లో విశాఖపట్నం స్పెషల్ ఎకనామిక్ జోన్ డెవలప్‌మెంట్ కమిషనర్ శ్రీనివాస్ ముప్పాల పాల్గొన్నారు. తెలుగు రాష్ట్రాల్లోని అన్ని సెజ్ ప్రాంగణాల్లో యోగా వేడుకలు చేపట్టినట్టు తెలిపారు. యోగా గురువు ప్రభాకర్ మూర్తిని సత్కరించారు.

రావికమతం మండలం రావికమతం సచివాలయం, చినపాచిల, కవగుంట, కొత్తకోట ప్రాథమిక ఆరోగ్య కేంద్రం యోగాంధ్రను నిర్వహించారు. కోటవురట్ల ఎంపీడీవో కార్యాలయం, జల్లూరు, పాములవాక జిల్లా పరిషత్ పాఠశాల వద్ద యోగాసనాలు వేశారు. గొలుగొండ మండలంలోని చీడిగుమ్మల, జోగంపేట హైస్కూల్లో, ఎంపిడిఒ కార్యాలయం వద్ద యోగా దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. నక్కపల్లి మండలం రెవెన్యూ కార్యాలయం, పెదబోదుగలం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల మైదానం, వేంపాడు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల మైదానంలో యోగాంధ్ర నిర్వహించారు. రోలుగుంట మండలం రోలుగుంట జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల, బుచ్చంపేట ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వద్ద యోగా డే వేడుకలను నిర్వహించారు. నాతవరం మండల కేంద్రం వద్ద సిబ్బంది యోగాసనాలు వేశారు. నర్సీపట్నంలోని స్థానిక ఎన్టీఆర్ మినీ స్టేడియం, శాఖ గ్రంథాలయం, పలు ప్రాంతాల్లో యోగా డే కార్యక్రమాన్ని నిర్వహించారు. అభీద్ సెంటర్లో మనవహారం నిర్వహించారు. మాడుగులలోని మోదకొండమ్మ శతకం పట్టు వద్ద యోగ దినోత్సవం ఘనంగా నిర్వహించారు. పాయకరావుపేట తహశీల్దారు కార్యాలయం వద్ద యోగాంధ్ర కార్యక్రమం నిర్వహించారు.

అనకాపల్లి జిల్లా కలెక్టర్ కార్యాలయ ప్రాంగణంలో జిల్లా రెవెన్యూ అధికారి వై.సత్యనారాయణరావు ఆధ్వర్యంలో యోగాసనాలు వేశారు. జిల్లా ప్రణాళిక అధికారి జి.రామారావు, జిల్లా ఆయుష్ అధికారి డాక్టర్ కె.లావణ్య, జిల్లా యోగాంధ్ర సమన్వయ అధికారి కె మనోరమ, వివిధ శాఖలకు చెందిన జిల్లా అధికారులు, కలెక్టరేట్ ఉద్యోగులు ఇందులో పాల్గొన్నారు. అనకాపల్లి డైట్ కళాశాలలో విద్యార్థులు, అధ్యాపక సిబ్బంది సుమారు 600 మంది యోగ కార్యక్రమంలో పాల్గొన్నారు. అనకాపల్లి శారదా నది వద్ద, తుమ్మపాల జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలోనూ, ప్రాంతీయ వ్యవసాయ పరిశోధన స్థానంలోనూ యోగాభ్యసన చేశారు. ఎల్ఐసి ఉద్యోగులు జీవిత బీమా కార్యాలయం నుండి ఎన్టీఆర్ జంక్షన్ ర్యాలీ నిర్వహించారు. సబ్బవరం మండలంలోని తహశీల్దారు, సబ్ రిజిస్ట్రార్ కార్యాలయం వద్ద యోగాసనాలు నిర్వహించారు. పలు పంచాయితీ కార్యాలయాల వద్ద యోగాభ్యసన జరిగింది. మునగపాక మండలం తోటాడలో ఆదినారాయణ స్వామి రాజయోగాశ్రమం ట్రస్టు ఆధ్వర్యంలో యోగాసన కార్యక్రమం నిర్వహించారు. కె.కోటపాడు మండలంలోని పాఠశాలలు, ప్రభుత్వ కార్యాలయాల ఆవరణలోనూ యోగాంధ్ర కార్యక్రమాలు నిర్వహించారు. ఎంపిడిఒ, సిడిపిఒ కార్యాలయాలు, చౌడువాడ, కె. కోటపాడు గ్రామ సచివాలయాల వద్ద సిబ్బంది యోగా చేశారు. పరవాడ మండలం రావాడ పంచాయతీలో సచివాలయ సిబ్బంది, ఉపాధి హామీ కూలీలు యోగాసనాలు నిర్వహించారు. బుచ్చయ్యపేట మండలంలో తహసీల్దార్ కార్యాలయం వద్ద, వివిధ గ్రామల్లోనూ యోగాభ్యసన చేశారు. దేవరాపల్లి మండలలో పిహెచ్‌సి, తహశీల్దార్ కార్యాలయం, తెనుగుపూడి గురుకుల పాఠశాల తదితర ప్రాంతాల్లో యోగా దినోత్సేవం నిర్వహించారు.



డైట్ కళాశాలలో యోగాలో పాల్గొన్న విద్యార్థులు

యువత పోరు స్థల పరిశీలన

ప్రజాశక్తి- విశాఖ కలెక్టరేట్ : వైసిపి అధినేత, మాజీ ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డి ఇచ్చిన పిలుపుమేరకు ఈ నెల 23వ తేదీన చేపట్టే యువత పోరు కార్యక్రమానికి 34వ వార్డు కార్పొరేటర్ తోట పద్మావతితో కలిసి మాజీ ఎమ్మెల్యే వాసుపల్లి గణేష్ కుమార్ జిల్లా పరిషత్ జంక్షన్ ప్రాంతాన్ని పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మీడియాతో మాట్లాడుతూ, కూటమి నాయకులు ఎన్నికల ముందు నిరుద్యోగులకు నెలకు రూ.3 వేలు నిరుద్యోగ భృతి ఇస్తామని హామీ ఇచ్చి, అధికారంలోకి వచ్చి 12 నెలలు పూర్తయినప్పటికీ అమలు చేయకపోవడం సిగ్గుచేటు అన్నారు. తక్షణమే నిరుద్యోగులకు 12 నెలల బకాయి నిరుద్యోగ భృతి రూ. 36 వేలు చెల్లించాలని డిమాండ్ చేశారు. ఎన్నికల ముందు బూటక హామీలు గుప్పించి అధికారంలోకి వచ్చిన కూటమి ప్రభుత్వం ఇచ్చిన హామీలన్నింటినీ అమలు చేయాలని కోరారు. ఇచ్చిన హామీల్లో 99 శాతం అమలు చేసిన ఘనత వైసిపి ప్రభుత్వానిదే అన్నారు. ఈ ఏడాది కూటమిపాలనంతా రెడ్ బుక్ రాజ్యాంగంతో లోకేష్ నడిపిస్తున్నాడని విమర్శించారు. విద్యాశాఖ మంత్రిగా లోకేష్ పూర్తిగా అట్టర్ ప్లాప్ అయ్యాడని దుయ్యబట్టారు. విద్యార్థులను, నిరుద్యోగులను మోసం చేస్తున్న చంద్రబాబు కూటమి ప్రభుత్వంపై వైసిపి యువత పోరు కార్యక్రమం ద్వారా ప్రజల్లో చైతన్యం తీసుకొస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా బిసి సెల్ అధ్యక్షులు సనపల రవీంద్ర భరత్, జిల్లా ఆర్‌టిఐ అధ్యక్షులు వడ్డాది దిలీప్, లింగం శ్రీను, ఎర్నెమ్మ గుడి చైర్మన్ లండ రమణ పాల్గొన్నారు.



చంద్రబాబును సత్కరిస్తున్న గంట్ల శ్రీనుబాబు

పంచగ్రామాల సమస్య పరిష్కారానికి విజ్ఞప్తి

ప్రజాశక్తి- విశాఖ కలెక్టరేట్ : సింహాచలం భూ సమస్య పరిష్కారం కాకపోవడం వల్ల పంచగ్రామాల ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కోంటున్నారని, ఆ సమస్యను పరిష్కరించాలని ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడును సింహాచలం దేవస్థానం ధర్మకర్తల మండలి మాజీ సభ్యులు, జాతీయ జర్నలిస్టుల సంఘం కార్యదర్శి గంట్ల శ్రీనుబాబు కోరారు. జిల్లా కలెక్టర్ కార్యాలయంలో శనివారం ఏర్పాటుచేసిన పాత్రికేయుల సమావేశం అనంతరం సిఎంకు ప్రత్యేక అభినందనలు తెలిపి శేషవస్త్రంతో శ్రీనుబాబు సత్కరించారు. అనంతరం పంచగ్రామాల సమస్యను ముఖ్యమంత్రి దృష్టికి తీసుకెళ్లారు. దీనిపై చంద్రబాబు స్పందింస్తూ సింహాచలం దేవస్థానం పంచ గ్రామాల భూ సమస్య పరిష్కారానికి ప్రభుత్వ పరంగా పూర్తిస్థాయిలో కృషి చేస్తున్నట్లు చెప్పారు. దేవాలయాల భూముల సమస్య సున్నితమైనదని పేర్కొన్నారు. సింహాచలం భూములకు సంబంధించి ఇప్పటికే మంత్రుల కమిటీ ప్రణాళిక బద్ధంగా ముందుకు సాగుతుందని వివరించారు. వీలైనంత త్వరలో పరిష్కారానికి కృషి చేస్తున్నట్లు చెప్పారు.

ఆన్‌లైన్ యోగా భాగస్వామ్యంతో హాబిల్డ్ ప్రపంచ రికార్డు

ప్రజాశక్తి- ఎంవిపి.కాలనీ : అంతర్జాతీయ యోగా దినోత్సవం సందర్భంగా భారతదేశపు మొట్టమొదటి హ్యాబిట్ నిర్మాణ వేదిక అయిన హాబిల్డ్ 'ప్రపంచవ్యాప్తంగా అత్యధిక హాజరుతో నిర్వహించిన ఆన్‌లైన్ యోగా తరగతి' కొత్త ప్రపంచ రికార్డును నెలకొల్పిందని సంస్థ ప్రతినిధి సౌరభ్ బోథ్రా తెలిపారు. విశాఖలో శనివారం ఆయన మీడియాతో మాట్లాడుతూ, ఈ ఘనత ద్వారా హాబిల్డ్ యోగా ప్రాముఖ్యతను ప్రపంచవ్యాప్తంగా మరింత విస్తరించిందని పేర్కొన్నారు. 169 దేశాల నుండి 7,52,074 మందికి పైగా పాల్గొన్నారని ఆయన తెలిపారు. ప్రపంచవ్యాప్తంగా తమ సేవలు అందుబాటులో ఉండటం ద్వారా, ఇది 100కు పైగా దేశాల నుండి యోగా అభ్యాసకులను ఒకే వేదికపైకి తీసుకురావడం ద్వారా, అత్యంత విస్తృతమైన, అంతర్జాతీయ స్థాయి యోగా కార్యక్రమాల్లో ఒకటిగా నిలిచిందని పేర్కొన్నారు. ఇది ఇప్పటివరకు హాబిల్డ్ యొక్క ఐదవ ప్రపంచ రికార్డు అని తెలిపారు. జనవరి 2024లో 2,46,252 మంది వీక్షకులతో యూట్యూబ్‌లో యోగా లైవ్ స్ట్రీమ్ గిన్నిస్ వరల్డ్ రికార్డును నెలకొల్పిందని ఆయన తెలిపారు.

'సన్‌రైజ్'కు బెస్ట్ చిల్డ్రన్ హాస్పిటల్‌గా అవార్డు

ప్రజాశక్తి -గాజువాక : 'ఇంటర్నేషనల్ హెల్త్‌కేర్ అవార్డ్స్-2025'లో గాజువాక సన్‌రైజ్ చిల్డ్రన్ హాస్పిటల్ బెస్ట్ చిల్డ్రన్ హాస్పిటల్ అవార్డు అందుకుంది. ఈ పురస్కారాన్ని ప్రముఖ క్రికెటర్ జాంటీ రోడ్స్ (దక్షిణాఫ్రికా మాజీ క్రికెటర్, ప్రస్తుత కోచ్) చేతుల మీదుగా హాస్పిటల్ ఎమ్‌డి డాక్టర్ టి.తిరుపతిరావు అందుకున్నారు. ఈ సందర్భంగా డాక్టర్ తిరుపతిరావు మాట్లాడుతూ, అవార్డు రావడం ఆసుపత్రి చరిత్రలో ఒక గొప్ప ఘట్టం అని పేర్కొన్నారు. ఇది కేవలం ఒక గౌరవం మాత్రమే కాకుండా, బాలల ఆరోగ్య పరిరక్షణలో ఆసుపత్రికి కలిగిన నిబద్ధతకు ప్రతీక అన్నారు. ఈ విజయం వెనుక ఆసుపత్రిలో పనిచేసే ప్రతి ఒక్కరి కృషి ఉందన్నారు. డాక్టర్లు, నర్సులు, పరిపాలన బృందం ప్రతి రోజూ పిల్లల ఆరోగ్యం కోసం శ్రమిస్తున్నారని తెలిపారు. ఒక చిన్నపాటి జబ్బు నుంచి సంక్లిష్టమైన కేసు వరకూ ప్రతి చికిత్సలో ప్రేమ, కృతజ్ఞత, శ్రద్ధ చూపడం ద్వారానే ఆసుపత్రి ప్రత్యేకతగా నిలిచిందన్నారు. ఈ పురస్కారం ద్వారా బాలల ఆరోగ్య పరిరక్షణ రంగంలో సన్‌రైజ్ చిల్డ్రన్ హాస్పిటల్ దేశవ్యాప్తంగా ఒక ప్రమాణంగా మారిందన్నారు. ఈ గౌరవం ఆసుపత్రిని మరింత బాధ్యతతో ముందుకు నడిపిస్తుందని పేర్కొన్నారు. ఇది కేవలం గత విజయాలకు గుర్తింపు మాత్రమే కాదు, భవిష్యత్తులో మరిన్ని ఉత్తమ సేవలు అందించేందుకు ఇచ్చిన ప్రేరణ అని తెలిపారు. విశాఖపట్నంలోని సన్‌రైజ్ చిల్డ్రన్ హాస్పిటల్ ఇప్పుడు భారతదేశ బాల వైద్య రంగంలో ఒక శిఖర స్థాయికి చేరిందన్నారు.



బెస్ట్ చిల్డ్రన్ హాస్పిటల్ అవార్డు అందుకుంటున్న డాక్టర్ తిరుపతి

జిల్లా కలెక్టర్‌కు ముఖ్యమంత్రి ప్రశంస

ప్రజాశక్తి- విశాఖ కలెక్టరేట్ : అంతర్జాతీయ యోగా దినోత్సవ వేడుకల క్రతువును అత్యంత విజయవంతంగా నిర్వహించడంలో కీలక పాత్ర పోషించిన జిల్లా కలెక్టర్ ఎంఎన్. హరేంధిర ప్రసాద్‌ను ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు ప్రశంసించారు. యోగా వేడుకల అనంతరం కలెక్టరేట్‌లో నిర్వహించిన విలేకరుల సమావేశంలో చంద్రబాబు మాట్లాడుతూ, అంతర్జాతీయ స్థాయి కార్యక్రమ నిర్వహణలో అధికార యంత్రాంగం కీలక పాత్ర పోషించిందని, ముఖ్యంగా విశాఖపట్నం జిల్లా కలెక్టర్ శక్తివంచన లేకుండా కృషి చేశారని కితాబిచ్చారు. వేడుకల నిర్వహణలో అధికారులు, ప్రజా ప్రతినిధులు సమన్వయం వహించారని, ఫలితంగా ఇంత పెద్ద కార్యక్రమాన్ని విజయవంతం చేయగలిగామని పేర్కొన్నారు.

గోతులతో గాల్లో ప్రాణాలు

- ప్రధాన రహదారులపై పెద్ద పెద్ద గుంతలు
- అనకాపల్లి పట్టణంలోనూ అదే పరిస్థితి
- వర్షపు నీరు నిల్వతో చెరువులను తలపిస్తున్న రోడ్లు
- కోట్ల ఖర్చంటూ నేతలు చెబుతున్నా మారని వైనం



బవులువాడ వద్ద శిథిలమైన ప్రధాన రహదారి



చెరువును తలపిస్తున్న పెరుగు బజారు రోడ్డు

ప్రజాశక్తి-అనకాపల్లి రూరల్

అనకాపల్లిలో రోడ్లు ప్రమాదకరంగా ఉన్నాయి. ఆదమరిస్తే ఇక ప్రాణాలు గాల్లో కలిసిపోయే అనే రీతిలో నెలకొన్నాయి. వాహనదారులకు, ప్రయాణికులకు కష్టాలు పెంచుతున్నాయి. ముఖ్యంగా రోగులు, గర్భిణులకు నరకాన్ని చూపిస్తున్నాయి. ఎక్కడ చూసినా గోతులు, రహదారులపై నీటి నిల్వలు. ఇవి ప్రమాదాలకు కారణంగా నిలుస్తున్నాయి. రాష్ట్ర ప్రభుత్వం అభివృద్ధి పేరుతో కోట్లు ఖర్చు చేస్తున్నట్లు చెబుతున్నప్పటికీ క్షేత్రస్థాయిలో ఆ ఛాయలు ఎక్కడా కానరావడం లేదు. అనకాపల్లి ఎమ్మెల్యే కొణతాల రామకృష్ణ రోడ్ల అభివృద్ధికి కోట్లాది రూపాయలు తెచ్చామని ప్రకటిస్తున్నా పట్టణంలో పరిస్థితి మాత్రం అందుకు భిన్నంగా ఉంది. ప్రధానంగా అనకాపల్లి పట్టణంలోనూ, అనకాపల్లి నుండి చోడవరం వెళ్లే మార్గంలోనూ రోడ్లు పెద్ద పెద్ద గోతులతో చాలా అధ్వానంగా ఉన్నాయి. అనకాపల్లి పెరుగు బజారు వద్ద రోడ్డుపై పెద్ద గొయ్యిలో వర్షపు నీరు చేరి చెరువును తలపించేలా ఉంది. చోడవరం వెళ్లే మార్గంలో తుమ్మపాల, బవులవాడ తదితర ప్రాంతాల్లో రహదారి పూర్తిగా శిథిలమై ప్రయాణానికి తీవ్ర ఇబ్బందులు పడాల్సి వస్తోంది. ఇక వర్షా కాలం మొదలైన నేపథ్యంలో రోడ్లపై గోతుల్లో నీరు నిలిచి ప్రమాదాలకు దారి తీస్తోంది. అంబులెన్సులు కూడా రోడ్లపై నెమ్మదిగా కదలాల్సిన పరిస్థితి ఏర్పడింది. ఇది ఆరోగ్య పరిస్థితులపై తీవ్ర ప్రభావం చూపుతోందని ప్రజలు వాపోతున్నారు.



తుమ్మపాల వద్ద ప్రధాన రహదారిపై పెద్ద గొయ్యి

గత ప్రభుత్వ హయాంలో రోడ్ల దుస్థితిని తీవ్రంగా విమర్శించిన కూటమి నేతలు.. ఇప్పుడు అధికారంలోకి వచ్చాక రోడ్ల పరిస్థితి అలాగే ఉన్నా మిన్నకుండిపోయారు. 'జగనన్న రోడ్లు' అంటూ అప్పట్లో పెద్ద ఎత్తున ఆరోపణలు చేసిన నేతలు, ఇప్పుడు అదే సమస్యల పట్ల నిర్లక్ష్యం వహించడం పట్ల పలువురు విమర్శలు చేస్తున్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం, ప్రజాప్రతినిధులు మాటలకు పరిమితం కాకుండా ఆచరణలో రోడ్లను బాగు చేయడంపై దృష్టి సారించాలని పలువురు కోరుతున్నారు.

నిర్లక్ష్యంగా వదిలేశారు



అనకాపల్లిలో ప్రధాన రహదారులు దెబ్బతిన్నాయి. ఇక గ్రామీణ రోడ్ల పరిస్థితి చెప్పనక్కర్లేదు. అధ్వానంగా ఉన్నాయి. గత ప్రభుత్వం కన్నా నిర్లక్ష్యంగా వదిలేశారు.

- పడాల భాను, డ్రైవర్, అనకాపల్లి.

ఇంటి సరిహద్దు విషయంపై ఘర్షణ

నలుగురికి గాయాలు

ప్రజాశక్తి-దేవరాపల్లి : మండలంలోని రైవాడ గ్రామంలో ఇంటి నిర్మాణం సందర్భంగా సరిహద్దు విషయంలో రెండు కుటుంబాల మధ్య శనివారం ఘర్షణ జరిగింది. ఈ ఘటనలో ఒక కుటుంబానికి చెందిన భార్యా భర్తలతో పాటు వారి కుమారుడు గాయపడగా, మరో కుటుంబానికి చెందిన మహిళ గాయపడింది. దీనికి సంబంధించి పోలీసులు, గాయపడిన కుటుంబ సభ్యులు తెలిపిన వివరాలు ప్రకారం... రైవాడ రామాలయానికి ఎదురుగా ఉన్న వీధిలో ఇంటి నిర్మాణ సరిహద్దు విషయంలో శీర రమణ, శీర అచ్చియ్యమ్మ కుటుంబాల మధ్య శనివారం ఘర్షణ జరిగింది. ఈ ఘటనలో శీర రమణతో పాటు అతని భార్య లక్ష్మి తలపై బలమైన గాయాలు తగలగా, రమణ కుమారుడు దుర్గాప్రసాదు చేతికి దెబ్బ తగిలింది. తీవ్రంగా గాయపడిన వీరిని దేవరాపల్లి ప్రభుత్వ ఆసుపత్రిలో వైద్యం చేయించిన అనంతరం 108 అంబులెన్సులో కె.కోటపాడు సిహెచ్‌సికి తరలించారు. వారి నుంచి దేవరాపల్లి పోలీసులు వాంగ్మూలం తీసుకున్నారు. కాగా ఈ ఘర్షణలో శీర రమణ కుటుంబం తనపై దాడి చెయ్యడంతో నోటిపై బలమైన గాయాలయ్యాయంటూ పోలీసులకు శీర అచ్చియ్యమ్మ ఫిర్యాదు చేసింది. ఇరువర్గాల నుంచి ఫిర్యాదులందాయని, కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని హెడ్ కానిస్టేబుల్ పైడిరాజు తెలిపారు. ఈ ఘర్షణలో కర్రతోనూ, ఇటుకలతో అచ్చియ్యమ్మ, వారి కుటుంబ సభ్యులు తమ అత్తవారి కుటుంబంపై దాడి చేశారంటూ శీర రమణ అల్లుడు చల్లా గంగునాయుడు విలేకరులకు తెలిపారు.



ఆసుపత్రిలో శీర రమణ, లక్ష్మి, దుర్గాప్రసాద్

నివాసాల మధ్య ఉన్న డంపింగ్ యార్డును తరలించాలి

తుమ్మపాలలో గ్రామస్తుల ఆందోళన

ప్రజాశక్తి-అనకాపల్లి

అనకాపల్లి మండలం తుమ్మపాల మేజర్ పంచాయతీ పరిధిలోని నివాసాల మధ్య చెత్త డంపింగ్ యార్డ్‌ను వేరే చోటుకు తొలగించాలని శనివారం గ్రామస్తులు ఆందోళన చేపట్టారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ సుమారు 25,000 జనాభా కలిగిన తుమ్మపాల మేజర్ పంచాయతీలో ఊరు మధ్యన డంపింగ్ యార్డ్ ఉందని, దీని నుండి వస్తున్న విపరీతమైన దుర్గంధంతో చుట్టుపక్కల ఉన్నటువంటి నివాస ప్రజలు ఇబ్బంది పడుతున్నారని పేర్కొన్నారు. ఈ డంపింగ్ యార్డు వల్ల మలేరియా, డయేరియా, విష జ్వరాలు ప్రబలుతున్నాయని, ఈ వర్షాకాల సమయంలో అంటూ వ్యాధులు వస్తున్నాయని ఆందోళన వ్యక్తం చేశారు. ఇదే ప్రాంతంలో ప్రతి శనివారం పెద్ద ఎత్తున పశువుల సంత, కూరగాయల మార్కెట్ కూడా జరుగుతుందని, ఈ సంతకు చుట్టుపక్కల సుమారుగా 50 గ్రామాల నుండి ప్రజలు వచ్చి ఈ సంతలో నిత్యవసర వస్తువులు కొనుకుంటూ ఉంటారని తెలిపారు. చెత్త వలన వారంతా ఇబ్బందులు ఎదుర్కొంటున్నారన్నారు. గత ప్రభుత్వం కాలంలో చెత్త నుండి సంపద తయారు కేంద్రం పెట్టి చెత్తను ఎప్పటికీ అప్పుడు తరలించేవారని, కానీ కూటమి ప్రభుత్వం వచ్చాక సంపద తయారీ కేంద్రాలు నిరుపయోగంగా ఉండిపోయాయని తెలిపారు. దీంతో చెత్త భారీగా పేరుకుపోతుందని ఆవేద వ్యక్తం చేశారు. తక్షణమే డంపింగ్ యార్డ్‌ను తరలించాలని డిమాండ్ చేశారు.



ఆందోళన చేస్తున్న తుమ్మపాల గ్రామస్తులు

కార్యక్రమంలో బొడ్డపాటి చిన్న రాజారావు, పిడి గాంధీ, ఆర్డీసీ సత్యనారాయణ, వియ్యపు సింహాచలం యాదవ్, బొడ్డపాటి గంగ శ్రీనివాసరావు, కర్రి కోటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.



విద్యార్థికి ధ్రువపత్రం అందిస్తున్న ప్రిన్సిపల్ శ్రీనివాసరావు

పాలిటెక్నిక్ కౌన్సెలింగ్ ప్రారంభం

164 మంది విద్యార్థులు హాజరు

ప్రజాశక్తి-అనకాపల్లి

అనకాపల్లి ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలలో శనివారం పాలిటెక్నిక్ కౌన్సెలింగ్ ప్రారంభమైంది. పాలీసెట్‌లో ర్యాంకుల సాధించిన విద్యార్థుల ధ్రువపత్రాల పరిశీలన చేశారు. ఒకటి నుంచి 15 వేల ర్యాంకు వరకు జరిగిన ఈ ధ్రువపత్రాల పరిశీలనకు 164 మంది విద్యార్థులు హాజరైనట్లు కళాశాల ప్రిన్సిపల్ ఐవిఎస్ఎస్ శ్రీనివాసరావు తెలిపారు. కౌన్సెలింగ్ పూర్తయ్యేసరికి 97 మంది బాలురు, 67 మంది బాలికలు తమ ధ్రువపత్రాల పరిశీలన జరిగింది. ఉత్తమ ర్యాంకులు సాధించిన ఎస్ శ్రీవెంకట్, లక్కవరపు ధరణిలకు ప్రిన్సిపల్ ధ్రువ పత్రాలను అందజేశారు. కాగా సోమవారం 15 వేల ఒకటి నుంచి 32 వేల ర్యాంక్ వరకు అభ్యర్థుల ధ్రువ పత్రాలను పరిశీలన ఉంటుందని చెప్పారు.



అప్పలనాయుడుతో మాట్లాడుతున్న అదీప్‌రాజ్ తదితరులు

అప్పలనాయుడుకు అదీప్‌రాజ్ పరామర్శ

ప్రజాశక్తి-సబ్బవరం

మండలంలోని రాయపుర అగ్రహారంలో కేసులలో అరెస్టయి విడుదలైన ఆ గ్రామ సర్పంచ్ పిల్లల అప్పలనాయుడును పెందుర్తి మాజీ ఎమ్మెల్యే అన్నంరెడ్డి అదీప్‌రాజ్ పరామర్శించారు. అదీప్‌రాజ్ సీనియర్ నాయకులతో కలిసి శనివారం సర్పంచ్ స్వగృహానికి వెళ్ళి ధైర్యం చెప్పారు. ఈ సందర్భంగా అదీప్‌రాజ్ మాట్లాడుతూ పార్టీ పరంగా అన్ని విధాలుగా అండగా ఉంటామని భరోసా ఇచ్చారు. ఈ కార్యక్రమంలో పెందుర్తి నియోజకవర్గం సీనియర్ నాయకులు గండి రవికుమార్, వైసిపి నేతలు కోటాన రాము, మాజీ ఎంపిపి సబ్బవరపు ముత్యాలనాయుడు, రాపేటి రాము, బొద్దేటి మహాలక్ష్మి నాయుడు, మళ్ల బాలాజీ, ఐడి బాబు, వైసిపి కార్యకర్తలు పాల్గొన్నారు.

వరి విత్తనాల పంపిణీ

ప్రజాశక్తి-బుచ్చయ్యపేట

మండలంలోని దిబ్బిడి గ్రామంలో ప్రభుత్వం సమకూర్చిన వరి విత్తనాలను శనివారం స్థానిక నాయకులు రైతులకు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రాయితీపై ఇచ్చిన వరి విత్తనాలను సద్వినియోగం చేసుకోవాలని కోరారు. కార్యక్రమంలో మాజీ ఎంపిటిసి గోన్నాబత్తుల శ్రీనివాసరావు, నాయకులు పెదిరెడ్ల రాజు, సానపతి మణికంఠ, లీలా తదితరులు పాల్గొన్నారు.



విత్తనాలు పంపిణీ చేస్తున్న మాజీ ఎంపిటిసి శ్రీనివాస్ తదితరులు



సిబ్బందితో మాట్లాడుతున్న నూతన ఎంపిడిఒ భానోజీ

ఎంపిడిఒగా భానోజీ బాధ్యతల స్వీకరణ

ప్రజాశక్తి-బుచ్చయ్యపేట

బుచ్చయ్యపేట మండల అభివృద్ధి అధికారిగా హెచ్.భానోజీ శనివారం మండల పరిషత్తు కార్యాలయంలో బాధ్యతలు స్వీకరించారు. గతంలో ఎంపీడీఓగా పనిచేసిన విజయలక్ష్మి మృతి చెందడంతో భానోజీ విధుల్లో చేరారు. ఆయనకు కార్యాలయం సిబ్బంది స్వాగతం పలికారు.



దుక్కుదున్ని సిద్ధం చేసిన నారు మడి

వరి ఆకు మడులను సిద్ధం చేస్తున్న రైతులు

ప్రజాశక్తి-బుచ్చయ్యపేట

ఖరీఫ్ సాగుకు సమయం ఆసన్నమవుతుంది. దీంతో రైతుల వ్యవసాయ పనుల్లో నిమగ్నమయ్యారు. మండలంలోని బుచ్చయ్యపేట, దిబ్బిడి, చిన్నప్పన్నపాలెం, కందిపూడి, రాజాం తురకలపూడి తదితర గ్రామాల్లో రైతులు వరి ఆకు మడులను ట్రాక్టర్లతో దున్నించి సిద్ధం చేసుకుంటున్నారు. వర్షాలు కురిస్తే ఆకులు వేయడానికి వరి విత్తనాలను సైతం సమకూర్చుకుంటున్నారు.

ఘనంగా ప్రపంచ సంగీత దినోత్సవం

ప్రజాశక్తి-అనకాపల్లి


స్థానిక సిద్దార్థ సోషల్ సర్వీస్ అండ్ కల్చరల్ అసోసియేషన్ అధ్యక్షులు బల్లా నాగభూషణం ఆధ్వర్యంలో శనివారం ప్రపంచ సంగీత దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ముందుగా అమర గాయకులు ఘంటసాల చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా నాగభూషణం మాట్లాడుతూ భారత దేశం సంగీతానికి పుట్టినిల్లు అని, ఎందరో సంగీత కళాకారులు ఎంతో ఖ్యాతిని గడించి చరిత్రలో చిరస్థాయిగా నిలిచి పోయారని తెలిపారు. త్యాగయ్య, అన్నమయ్య, పురందరదాసు, క్షేత్రయ్య, రామదాసు, వంటివారు తమ భక్తి కీర్తనలతో పేరు ప్రఖ్యాతలు సాధించారని చెప్పారు. అలాగే బాలమురళీకృష్ణ, ఘంటసాల, ఎస్పి.బాలసుబ్రహ్మణ్యం, సుశీల, జానకి, లీల, పిబి.శ్రీనివాస్ వంటి వారు తెలుగు సినీ రంగంలో తమ గానం ద్వారా తెలుగు జాతి, తెలుగు భాష కీర్తిని ప్రపంచానికి చాటి చెప్పారని తెలిపారు. ప్రపంచ సంగీత దినోత్సవాన్ని ప్రపంచ వ్యాప్తంగా జరుపుకుంటూ సంగీతం ప్రాధాన్యాన్ని గుర్తు చేసుకుంటారని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో అసోసియేషన్ ఉపాధ్యక్షులు పట్నాల కృష్ణ మోహన్, సహాయ కార్యదర్శి రొబ్బి మల్లేశ్వరరావు, కార్యవర్గ సభ్యులు నందేల అప్పారావు, ఐవి.రమణమూర్తి, ఎల్‌విఎ.రామారావు, సూరే సుబ్బారావు, నక్కిన శ్రీహర్ష పాల్గొన్నారు.



ఘంటసాల చిత్ర పటానికి పూలమాలతో నివాళులర్పిస్తున్న దృశ్యం

కూటమి నేతల్లో విభేదాలు

- అయినా ఎవరికివారు గుంభనంగా
- ఏ క్షణమైన కుంపటి రాజుకునే అవకాశం



ప్రజాశక్తి-అనకాపల్లి రూరల్

అనకాపల్లి కూటమి నేతలు ప్రస్తుతానికి ఎవరికి వారు గుంభనం పాటిస్తున్నా వారి మధ్య ఉన్న విభేదాలు ఏ క్షణమైనా రాజుకునే అవకాశాలు ఉన్నాయన్నది క్షేత్రస్థాయి రాజకీయ విశ్లేషకుల మాట. కార్యకర్తల్లో ఎలా ఉన్నా నేతల్లో అసంతృప్తి అనేది కొట్టిపారేయలేనిది. అందరూ సీనియర్ నాయకులు కావడం కూడా ఈ సమస్యకు కారణం కావచ్చు. తగిన గుర్తింపు లేకనే ఇదంతా అనేవారు ఉన్నారు.

నిజానికి అనకాపల్లి టీడీపీకి కంచుకోట. అయితే కూటమి ఏర్పడడంతో జనసేనకు టికెట్ కేటాయింపుతో కొణతాల రామకృష్ణ ఎమ్మెల్యేగా గెలిచారు. టిడిపిలోనే అత్యంత సీనియర్ నాయకులు ఉన్నారు. డైనమిక్ లీడర్‌గా పేరున్న మాజీ మంత్రి దాడి వీరభద్రరావుకు తగిన గుర్తింపు లేదు. దాడి కుటుంబాన్ని పూర్తి నిర్లక్ష్యం చేశారన్న నానుడి గట్టిగా వినిపిస్తోంది. అటు మాజీ ఎమ్మెల్సీ బుద్ధ నాగ జగదీష్‌కు ఇప్పటివరకు ఎలాంటి ప్రాతినిధ్యం కల్పించలేదు.

మరో వైపు నియోజకవర్గం ఇన్చార్జిగా ఉన్న పీలా గోవింద సత్యనారాయణకు నాగజగదీష్‌కు మధ్య విభేదాలు తారాస్థాయికి చేరాయన్నది వాస్తవం. వీరి మధ్య విభేదాలు ఇప్పటివి కాదు ఎప్పటి నుంచో ఉన్నాయి. ఇప్పటికే వారు ప్రత్యేక వర్గాలు తయారు చేసుకుని జనంలో తిరుగుతున్నారు. పీలా గోవింద అనకాపల్లి టిడిపిని భ్రష్ట పట్టిస్తున్నారు అనే ప్రచారాన్ని ఒక వర్గం తీసుకెళు ్తంది. అధికారంలోకి వచ్చినా నాగ జగదీష్‌కు ఎలాంటి గుర్తింపు పదవి లేకపోవడంతో సహజంగానే అసంతృప్తి ఉంటుందనేది అభిమానుల మాట.

ఇక జనసేన కార్యకర్తల్లో అసంతృప్తి అనేది గుంభనంగా ఉంది. నామినేటెడ్ పదవులు అన్ని టిడిపికే కేటాయించడంపై వారు అసంతృప్తితో ఉన్నారు. మార్కెట్, దేవాలయాలు ఇలా అన్ని నామినేటెడ్ పదవులు టిడిపికే కేటాయించారు. టిడిపి నియోజకవర్గం ఇన్‌ఛార్జి పీలా గోవింద సత్యనారాయణ, ఎమ్మెల్యే కొణతాల రామకృష్ణ చెట్టా పట్టాలు వేసుకొని తిరగడం కూడా ఇతర నాయకులకు రుచించడం లేదు. ఆ మధ్య దాడి జనసేన నాయకులపై బహిరంగంగానే విమర్శలు గుప్పించారు కూడా. పాలనలో అవినీతి చోటు చేసుకుంటుందని విమర్శలు కొన్ని నెలల కిందటే చేశారు. ఇక బీజేపీ నాయకులకు చెప్పుకోదగిన పదవులు ఏమి లేవు. టీడీపీ సానుకూల నేతగా పేరున్న ఎంపీ సిఎం.రమేష్ బిజెపి నేతలకు పెద్దగా పదవులను కేటాయించేలా కృషి చేయలేదు. ఇలా మూడు పార్టీల్లో పలువురు నేతల్లో అసంతృప్తి ఉందనేది క్షేత్రస్థాయి మాట. ఇప్పటికి గుంభనంగా ఉన్న ఈ అసంతృప్తి బాంబు ఎప్పుడు పేలుతుందో వేచి చూడాలి.

వ్యవసాయ కోర్సులతో ఉపాధి అవకాశాలు

అనకాపల్లి ఆర్ఎఆర్ఎస్‌లో రెండేళ్ల డిప్లమా, మూడేళ్ల ఇంజినీరింగ్



అనకాపల్లి ఆర్ఎఆర్ఎస్‌లో ఉన్న వ్యవసాయ పాలిటెక్నిక్, ఇంజనీరింగ్ కళాశాల

ప్రజాశక్తి-అనకాపల్లి

అనకాపల్లి ప్రాంతీయ వ్యవసాయ పరిశోధన స్థానంలో ఆచార్య ఎన్‌జి.రంగా వ్యవసాయ విశ్వవిద్యాలయం ఏర్పాటు చేసిన వ్యవసాయ పాలిటెక్నిక్, వ్యవసాయ ఇంజనీరింగ్ కళాశాలలు విద్యార్థుల జీవనోపాధికి బాసటగా నిలుస్తున్నాయి. వ్యవసాయ కోర్సుల ద్వారా వివిధ ఉపాధి అవకాశాలు లభిస్తున్నాయి.

అనకాపల్లి ఆర్ఎఆర్ఎస్‌లో 1999లో వ్యవసాయ పాలిటెక్నిక్ కళాశాల ఏర్పాటు చేశారు. రెండేళ్ల వ్యవసాయ పాలిటెక్నిక్ కోర్సు గ్రామీణ ప్రాంతంలో పదో తరగతి ఉత్తీర్ణులైన విద్యార్థుల భవిష్యత్తుకు బంగారు బాట వేస్తోంది. వ్యవసాయ, వ్యవసాయ అనుబంధ విభాగాల్లో స్వయం ఉపాధి కల్పన కోసం ఏర్పాటు చేసిన ఈ కళాశాలలో ఇంతవరకు 25 బ్యాచులు దిగ్విజయంగా 100 శాతం ఫలితాలు సాధించాయి. 2,500 మంది విద్యార్థులు ఇంతవరకు ఉత్తీర్ణులయ్యారు. వీరిలో 500 మంది వ్యవసాయ విస్తరణ అధికారులుగా, గ్రామ వ్యవసాయ సహాయకులుగా ఉపాధి పొందారు. అలాగే గుర్తింపు పొందిన అనేక ప్రైవేటు సంస్థల్లో 400 మంది ఉపాధి అవకాశాలు పొందారు.

అనకాపల్లి అగ్రికల్చరల్ పాలిటెక్నిక్ కళాశాలలో రెండేళ్ల డిప్లమా కోర్సులో 60 సీట్లు ఉన్నాయి. పదో తరగతిలో వచ్చిన మార్కులు ఆధారంగా సీట్లు కేటాయించడం జరుగుతోంది. డిప్లమా పూర్తయిన తరువాత పలు ఉపాధి అవకాశాలు పొందవచ్చు. డిప్లమా ఉత్తీర్ణులైన వారు బీఎస్సీ అగ్రికల్చర్‌లో ప్రవేశం పొందేందుకు ప్రవేశ పరీక్ష రాయవలసి ఉంటుంది. 2024లో నిర్వహించిన ప్రవేశ పరీక్షలో 17 మంది విద్యార్థులు బీఎస్సీ అగ్రికల్చర్‌లో సీట్లు సాధించారు. పాలిటెక్నిక్ డిప్లమో కోర్స్ పూర్తి చేసి ఉపాధి రానివారికి స్వయం ఉపాధి కల్పించాలనే ఉద్దేశంతో పిఎయంపి ప్రోగ్రాం ఏర్పాటు చేసి వారికి కావలసిన విభాగాల్లో శిక్షణ ఇస్తున్నారు.

అనకాపల్లి ఆర్ఎఆర్ఎస్‌లో 2013లో వ్యవసాయ ఇంజనీరింగ్ పాలిటెక్నిక్ కళాశాల ఏర్పాటు చేయడం జరిగింది. ఈ వ్యవసాయ ఇంజనీరింగ్ కళాశాలలో 30 సీట్లు ఉన్నాయి. ఇందులో కూడా పదో తరగతిలో వచ్చిన మార్కుల ఆధారంగానే సీట్లు కేటాయింపు ఉంటుంది. ఈ కళాశాల నుండి ఇప్పటి వరకు 400 మంది ఈ కోర్సు పూర్తి చేశారు. వారిలో 60 మంది వరకు మల్టీనేషనల్ కంపెనీల్లో ఉపాధి అవకాశాలు పొందారు. మూడేళ్ల ఈ ఇంజనీరింగ్ కోర్సు పూర్తి చేసిన తరువాత అగ్రిసెట్ రాసి బిటెక్ ద్వితీయ సంవత్సరంలో నేరుగా చేరవచ్చు.



2025 ఎపిఇసెట్‌లో ఉత్తమ ర్యాంకులు సాధించిన అనకాపల్లి వ్యవసాయ కళాశాల విద్యార్థులు

గ్రామీణ విద్యార్థులకు మంచి భవిష్యత్తు



గ్రామీణ ప్రాంత విద్యార్థులు ఉపాధి పొందే అవకాశం ఉన్న ఈ కోర్సుల్లో చేరితే మంచి భవిష్యత్తు ఉంటుంది. వ్యవసాయ పాలిటెక్నిక్, వ్యవసాయ ఇంజనీరింగ్ వల్ల ఉపాధి అవకాశాలు లభిస్తాయి. ఇప్పటి వరకు తమ కళాశాల విద్యార్థులు ప్రతి ఏటా 100శాతం ఉత్తీర్ణత సాధిస్తున్నారు. వ్యవసాయ పాలిటెక్నిక్, వ్యవసాయ ఇంజనీరింగ్ కోర్సుల్లో ప్రవేశానికి దరఖాస్తు చేసుకోవాలి.

-డాక్టర్ సిహెచ్ ముకుందరావు,
ఆర్ఎఆర్ఎస్ ఎడిఆర్ అండ్ కళాశాల ప్రిన్సిపల్

మత్స్యకారులకు పరిహారం చెల్లించాలి

- వంటా వార్పుతో నిరసన

ప్రజాశక్తి -నక్కపల్లి:మండలంలో వేంపాడు రెవెన్యూ అమలాపురంలో శ్రీ కనక మహాలక్ష్మి సాగర మత్స్య పారిశ్రామిక సహకార సంఘానికి లీజుకు ఇచ్చిన భూములకు సంబంధించి సాగు చేసుకుంటున్న మత్స్యకారులకు వెంటనే పరిహారం చెల్లించాలని సిపిఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు ఎం అప్పలరాజు డిమాండ్ చేశారు.తమ సంఘానికి లీజుకు ఇచ్చిన 43 ఎకరాల 15 సెంట్లు భూమికి నష్టపరిహారం చెల్లించాలని డిమాండ్ చేస్తూ మత్స్యకారులు తలపెట్టిన ఆందోళన మూడవ రోజు శనివారం కూడా కొనసాగింది. మత్స్యకారుల సంఘానికి లీజుకిచ్చిన భూమిలో మత్స్యకారులు టెంటు వేసి తమకు పరిహారం చెల్లించాలని డిమాండ్ చేస్తూ ఆందోళన చేపట్టారు. వంటావార్పుతో వినూత్న రీతిలో నిరసన తెలిపారు. ఈ సందర్భంగా సిపిఎం నేత అప్పలరాజు మాట్లాడుతూ గ్రామానికి చెందిన మత్స్యకార సంఘానికి 1994లో ఆనాటి ప్రభుత్వం 43 ఎకరాల 15 సెంట్లు భూమి లీజుకు ఇవ్వడం జరిగిందన్నారు. ఆనాటి నుంచి అమలాపురం గ్రామానికి చెందిన మత్యకారులు ఆ భూములపై ఆధారపడి కుటుంబాలను పోషించు కుంటూ జీవనం సాగిస్తున్నారన్నారు. పరిశ్రమలు ఏర్పాటుకు ప్రభుత్వం ఆ భూములను సేకరించిందని, నేటికీ మత్స్యకారులకు పరిహారం చెల్లించక పోవడంతో గ్రామానికి చెందిన మత్స్యకారులంతా ఆందోళన గుర్తి ఉద్యమ బాట పట్టారన్నారు. వెంటనే హోం మంత్రి అనిత స్పందించి మత్స్యకారులకు పరిహారం, ప్యాకేజీ చెల్లించాలని డిమాండ్ చేశారు. న్యాయం జరిగే వరకు పోరాటాన్ని కొనసాగిస్తామని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో సిపిఎం మండల కార్యదర్శి ఎం రాజేష్, పెద్ద సంఖ్యలో మత్స్యకారులు పాల్గొన్నారు.



వంటావార్పు చేపడుతున్న మత్స్యకారులు, సిపిఎం నేత అప్పలరాజు



పంపిణీ చేస్తున్న వాసవి, వనిత క్లబ్ సభ్యులు

రోగులకు రొట్టెలు, పండ్లు పంపిణీ

ప్రజాశక్తి- మాడుగుల:అంతర్జాతీయ వాసవి క్లబ్ ఆధ్వర్యంలో ప్రతి ఏడాది జూన్ నెలలో చేపట్టే సేవా కార్యక్రమాలు శనివారం మాడుగుల మండలంలో ఘనంగా జరిగాయి. మాడుగుల వాసవి క్లబ్, వనిత క్లబ్ ఆధ్వర్యంలో వాసవి క్లబ్ దత్తత పాఠశాల ప్రాథమిక పాఠశాలలో విద్యార్థులకు నోట్ పుస్తకాలను పంపిణీ చేశారు. అంతర్జాతీయ యోగా దినోత్సవం సందర్భంగా యోగా గురువు ప్రభాకర్‌రావు మాస్టార్ని ఘనంగా సత్కరించారు. పశువుల సౌకర్యార్థం గరుకు స్తంభాన్ని శ్రీనాథ్ రమేష్ పొలం వద్ద ఏర్పాటు చేశారు. శ్రీ వేణుగోపాల స్వామి ఆలయంలో క్లబ్ అధ్యక్షుడు కే రమేష్ అధ్యక్షతన సమావేశం నిర్వహించారు. ప్రభుత్వ ఆసుపత్రిలో రోగులకు పండ్లు, రొట్టెలు, బిస్కెట్లు ఆసుపత్రి వైద్యుల చేతుల మీదుగా పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో అంతర్జాతీయ వాసవి క్లబ్ అదనపు కోశాధికారి రామయ్య, ప్రోగ్రాం కోఆర్డినేటర్ పివి రమణమూర్తి, రీజనల్ చైర్మన్ పుట్ట నానాజీ, జోన్ చైర్మన్ పుట్ట మాధవి, వాసవి క్లబ్ అధ్యక్షుడు కోట్టేడ రమేష్, వనిత క్లబ్ అధ్యక్షురాలు పుట్టా రాధిక, క్లబ్ పిఎస్టీలు సభ్యులు, ఉపాధ్యాయులు, వైద్యులు పాల్గొన్నారు.

పరిసరాలను పరిశుభ్రంగా ఉంచాలి



ప్రతిజ్ఞ చేస్తున్న అధికారులు

ప్రజాశక్తి- నర్సీపట్నం:స్వచ్ఛ ఆంధ్ర సంకల్పానికి ప్రతి ఒక్కరూ నడుం బిగించాలని మున్సిపల్ కమిషనర్ సురేంద్ర సూచించారు. శనివారం యోగాంతర కార్యక్రమంలో భాగంగా కార్యాలయం వద్ద యోగ కార్యక్రమాన్ని నిర్వహించిన అనంతరం ప్రధాన కూడలి వద్ద పలు శాఖల అధికారులు విద్యార్థులతో మానవహారం నిర్వహించారు. స్వచ్ఛ ఆంధ్రపై నినాదాలు చేశారు. ప్రతి ఒక్కరూ స్వచ్ఛ ఆంధ్ర సంకల్పానికి భాగస్వాములు కావాలని, నగరాలను, పల్లెలను పరిశుభ్రంగా ఉంచుకోవాలన్నారు. కార్యక్రమంలో పలు శాఖల అధికారులు, వైద్య సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

కోటవురట్ల: పర్యావరణం పట్ల ప్రతి ఒక్కరు ప్రత్యేక దృష్టి సారించాలని తహసీల్దార్ తిరుమల బాబు సూచించారు. స్వచ్ఛ్ ఆంధ్ర కార్యక్రమంలో భాగంగా శనివారం కార్యాలయం ఆవరణలో మొక్కలు నాటారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, స్వచ్ఛ ఆంధ్ర కోసం పాటుపడాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఎంపిడీవో కాశీ విశ్వనాథరావు, ఆర్ఐ ఉర్వరావు, వీఆర్వో సంఘ నాయకులు రమేష్, సిబ్బంది పాల్గొన్నారు.



పరామర్శిస్తున్న చిక్కాల, నాయకులు

హరిబాబు కుటుంబానికి చిక్కాల పరామర్శ

ప్రజాశక్తి- పాయకరావుపేట:మండలంలోని పాల్మెన్ పేట పంచాయతీ వైసిపి గ్రామ శాఖ అధ్యక్షులు, పార్టీ సీనియర్ నాయకులు బొడ్డు హరిబాబు తండ్రి బొడ్డు సత్యనారాయణ ఇటీవల మరణించారు. ఈ విషయం తెలుసుకున్న జిల్లా వ్యవసాయ సలహా మండలి మాజీ చైర్మన్, వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ పాయకరావుపేట మండల అధ్యక్షులు చిక్కాల రామారావు శనివారం బొడ్డు హరిబాబు కుటుంబ సభ్యులను పరామర్శించి ఓదార్చారు. ఈ కార్యక్రమంలో పాల్మెన్ పేట పంచాయతీ సర్పంచ్ కోడా కోటేశ్వరరావు, పెంటకోట సర్పంచ్ చేపల తాతాజీ, మైలపల్లి శివాజీ, సింగిరి గోవిందు, దైలపల్లి బాబ్జీ, మైలపల్లి కాసులు, సింగిరి రమణ, దూడ తాతారావు పాల్గొన్నారు.

24న ప్రవేశ పరీక్ష

ప్రజాశక్తి-చీడికాడ:మండల కేంద్రం మంచాలలో గల ఏపీ మోడల్ స్కూల్‌లో మిగిలి ఉన్న 6,7,8,9, ఇంటర్మీడియట్ ప్రథమ సంవత్సరంలో మిగిలి ఉన్న సీట్ల భర్తీకి అడ్మిషన్ టెస్ట్ ఈనెల తేదీ 24 మంగళవారం పాఠశాలలో ఉదయం 10 నుంచి 12 గంటల వరకు నిర్వహించనున్నామని ప్రిన్సిపాల్ వెంకటలక్ష్మి తెలిపారు. దరఖాస్తు చేసుకున్న అభ్యర్థులు పాఠశాలకు ఉదయం 9 గంటలకు ప్రవేశ పరీక్ష కు హాజరవ్వాలన్నారు.

నేడు ఉచిత వైద్య శిబిరం

ప్రజాశక్తి-గొలుగొండ:మండలంలో మేజర్ పంచాయతీ ఏఎల్.పురం గ్రామంలో ఈ నెల 22న చెక్కా వెంకట పద్మావతి కళ్యాణ మండపంలో ఉచిత వైద్య శిబిరం నిర్వహిస్తున్నట్లు అల్లూరి సీతారామరాజు వాసవి క్లబ్ అధ్యక్ష కార్యదర్శులు చెక్కా సంతోష్, యక్కల నాగేశ్వరరావు, కసుమంచి నానాజీ ఒక ప్రకటనలో తెలిపారు. విశాఖపట్నం ఓమ్ని హాస్పటల్ డాక్టర్ జనరల్ ఫిజీషియన్ లగుడు నరేష్ ఉచితంగా వైద్య పరీక్షలు చేస్తారన్నారు. బీపీ, షుగర్, ఈసీజీ టెస్టులు ఉచితంగా చేపడతారని తెలిపారు. పరిసర ప్రాంత ప్రజలందరూ ఈ ఉచిత వైద్య శిబిరాన్ని సద్వినియోగం చేసుకోవాలని వారు సందర్భంగా కోరారు.

దరఖాస్తుల స్వీకరణ

ప్రజాశక్తి-చింతపల్లి: పెంటపాడు ప్రభుత్వ ఆర్ఐటీఐ కళాశాలలో పెంటపాడు, అప్పర్ సీలేరు కేంద్రాలలో 2025-26 విద్యా సంవత్సరానికి సంబంధించి మిగిలిన ఖాళీ సీట్ల భర్తీకి రెండవ విడత ప్రవేశ ప్రక్రియ ప్రారంభమైందని కళాశాల ప్రిన్సిపాల్ శ్రీనివాసాచారి తెలిపారు. అర్హత కలిగిన అభ్యర్థులు జూలై 15 వరకు www.iti.ap.gov.in వెబ్‌సైట్ ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. అభ్యర్థులు జూలై 17న దగ్గరలోని ప్రభుత్వ ఐటీఐ కేంద్రంలో ఒరిజినల్ సర్టిఫికెట్లతో వెరిఫికేషన్‌కు హాజరు కావాలన్నారు. పదవ తరగతి ఉత్తీర్ణత పొందిన అభ్యర్థులు జూలై 21న పెంటపాడు ప్రభుత్వ ఐటీఐ కళాశాలలో కౌన్సిలింగ్‌కు ధృవపత్రాలతో హాజరు కావాలని తెలిపారు.

27న ధర్నాను విజయవంతం చేయాలి

ప్రజాశక్తి -దుంబ్రిగుడ : పీఎం జన్మన్ గృహ బకాయి బిల్లులు చెల్లించాలని ఆదివాసీ గిరిజన సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు టి సూర్యనారాయణ డిమాండ్ చేశారు. గృహల బిల్లుల కోసం ఈ నెల 27న పాడేరు ఐటిడిఎ వద్ద చేపట్టే ధర్నాను విజయవంతం చేయాలని కోరుతూ శనివారం సాగర పంచాయతీ బలియగూడలో గిరిజన సంఘం ఆధ్వర్యంలో ఆందోళన చేపట్టారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, పిఎం జన్మన్ హౌసింగ్ పథకం కింద నిర్మించిన శ్లాబ్, లింటల్ లెవెల్ నిర్మాణంలో ఉన్న ఇళ్లకు బిల్లులు చెల్లించాల్సి ఉందని తెలిపారు. పాడేరు డివిజన్ పరిధిలోని 11మండలంలో రూ21కోట్ల54 లక్షల బిల్లులు బాకాయి ఉందన్నారు. ఈ కార్యక్రమంలో బి.సింగన్న, పి.శ్రీను, సంజయ్ కుమార్, వి.సుమంత్, పి డేవిడ్, బి.ధర్మేంద్ర తదితరులు పాల్గొన్నారు.

అరకులోయ రూరల్:పీఎం జన్ మన్ లబ్ధిదారులకు బకాయి బిల్లులు చెల్లించాలని డిమాండ్ చేస్తూ ఈ నెల 27న పాడేరు ఐటిడిఏ కార్యాలయం వద్ద జరిగే ధర్నా ను విజయవంతం చేయాలని ఆదివాసీ గిరిజన సంఘం మండల నాయకులు సిహెచ్ ఐసుబాబు పిలుపునిచ్చారు. శనివారం మండలంలోని సిరగాం పంచాయతీ దిబ్బవలస గ్రామంలో పర్యటించి లబ్ధిదారులతో మాట్లాడారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, పీఎం జన్ మన్ పథకం హౌసింగ్ బిల్లులు మంజూరు కావాలంటే హౌసింగ్ అధికారులకు ముడుపులు చెల్లిస్తే తప్ప బిల్లులు మంజూరు చేయడం లేదని లబ్ధిదారులు ఆరోపిస్తున్నారని, ఉన్నతాధికారులు సక్రమంగా పర్యవేక్షణ లేకపోవడంతో అవినీతికి పాల్పడుతున్నారన్నారు.పాడేరు ఐటీడీఏ పరిధిలో 2.0 హౌసింగ్ సర్వేచేసి నెలలు గడుస్తున్నా ఇప్పటికీ ఇల్లులు మంజూరు చేయలేదని 2.0 సర్వే చేసిన గిరిజనులకు పక్కా ఇళ్లు మంజూరు చేయాలని, ఒక్కొక్క ఇల్లు నిర్మాణానికి 10 లక్షలు మంజూరు చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో గ్రామస్తులు ఎస్ భాస్కర్‌రావు, బి గంగాధర్, ఎస్.దాసు, లబ్ధిదారులు పాల్గొన్నారు.

హుకుంపేట:మండలంలో మంజూరు చేసిన పిఎం జన్మాన్ ఆవాస్ యోజన గృహాలకు బిల్లులు చెల్లించకుండా ఎలా కట్టాలని ఆదివాసీ గిరిజన సంఘం నేతలు ప్రశ్నించారు. వివిధ గ్రామాలను సందర్శించారు. ఈ సందర్భంగా ఆ సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు టి.కృష్ణారావు, నాయకులు లక్ష్మణరావు, రామారావు మాట్లాడుతూ, మండలంలో పివిటిజి గిరిజనలకు 1762 గృహాలు మంజూరు చేయగా, ఇప్పటివరకు కేవలం 551 ఇండ్లకు మాత్రమే బిల్లులు చెల్లించారన్నారు. మిగిలిన గృహాలకు బకాయిలు పెండింగ్‌లో ఉన్నాయని, బిల్లులు చెల్లించకుండా ఇండ్లు ఎలా కట్టమంటారని ప్రభుత్వాన్ని ప్రశ్నించారు. ఇళ్లను రూఫ్ లెవెల్ వరకూ పూర్తిచేసినప్పటికీ చాలామందికి కనీస పునాది బిల్లులు కూడా అందలేదని వారు ఆవేదన వ్యక్తం చేశారు. వర్షాకాలం సమీపిస్తుండటంతో నిర్మాణాలపై లబ్ధిదారులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని పేర్కొన్నారు.బిల్లులు తక్షణమే విడుదల చేయకపోతే, పెద్ద ఎత్తున ఉద్యమం చేపడతామని హెచ్చరించారు. .ఈ కార్యక్రమంలో సంఘ నాయకులు పి.లింగమూర్తి, డి.కృష్ణమూర్తి పాల్గొన్నారు.

ముంచింగిపుట్టు : ఈనెల 27న ఐటిడీఏ కార్యాలయం వద్ద ధర్నాకు గిరిజన ప్రజానీకం కదిలి వచ్చి జయప్రదం చేయాలని ఆదివాసీ గిరిజన సంఘం మండల అధ్యక్ష కార్యదర్శులు ఎం ఎం శ్రీను, కె నర్సయ్య పిలుపునిచ్చారు. స్థానిక కార్యాలయంలో సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా శ్రీను మాట్లాడుతూ, జిల్లాలో బిల్లులు అందక ఆదివాసీలు అవస్థలు పడుతున్నారన్నారు. మండల కార్యదర్శి నరసయ్య మాట్లాడుతూ, ధర్నాకు పీఎం జన్ మన్ లబ్ధిదారులందరూ తరలిరావాలని కోరారు. గృహాలు, తాగునీరు, రోడ్డు, విద్యుత్, విద్య, వైద్యం , తదితర సౌకర్యాలు ఆదివాసుల ప్రాథమిక హక్కు అయినప్పటికీ... కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు వీటిని నిర్లక్ష్యం చేస్తున్నాయన్నారు.

గిరిజన విద్యార్థులకు సౌకర్యాలు కల్పించకపోవడం శోచనీయం

ప్రజాశక్తి-పాడేరు :- యోగాంధ్ర కార్యక్రమానికి విశాఖ తీసుకువెళ్లిన గిరిజన విద్యార్థులకు కనీస సౌకర్యాలు కల్పించడంలో ప్రభుత్వం విఫలం అయ్యిందని ఆదివాసి గిరిజన సంఘం జిల్లా అధ్యక్ష కార్యదర్శులు సాగిన ధర్మానపడాల్, పొద్దు బాలదేవ్ విమర్శించారు. శనివారం వారు స్థానిక విలేకరులతో మాట్లాడుతూ యోగాంధ్ర కార్యక్రమంలో అల్లూరి సీతారామరాజు జిల్లా నుండి 25000 మంది విద్యార్థులకు తీసుకువెళ్లి కోట్ల రూపాయలు ప్రజాధనం వెచ్చించి కనీస సౌకర్యాలు కూడా కల్పించకపోవడం చాలా బాధాకరం అన్నారు. కనీస సౌకర్యాలు లేక అల్లూరి సీతారామరాజు జిల్లా విద్యార్థిని విద్యార్థులు చాలా ఇబ్బందులు ఎదుర్కొన్నారని తెలిపారు. కనీసం ఉండడానికి సరైన వసతి, టాయిలెట్స్ లేకపోవడంతో ఇబ్బందులు పడ్డారని అన్నారు. గిన్నిస్ బుక్ రికార్డు కోసం గిరిజన విద్యార్థులకు కష్టాలు పాలు చేయడం ఎంతవరకు సమంజసం అని ప్రశ్నించారు. ఆదివాసి ప్రాంతాల్లో గిన్నిస్ బుక్ రికార్డు కన్నా 100శాతం ఉద్యోగ రిజర్వేషన్ కావాలని ఆదివాసి యువత అడుగుతున్నారన్నారు. జీవో నెంబర్ 3కి ప్రత్యామ్నాయ జీవో తేవాలని అడుగుతున్నారన్నారు. విద్యార్థులకు మెస్, కాస్మోటిక్ చార్జీలు పెంచాలన్నారు.

పారిశుధ్యానికి, సుందరీకరణకు తొలి ప్రాధాన్యత

- జివిఎంసి కమిషనర్‌గా బాధ్యతలు చేపట్టిన కేతన్ గార్గ్

ప్రజాశక్తి -ఎంవిపి కాలనీ:విశాఖ నగరంలో పారిశుధ్యానికి, సుందరీకరణకు తొలి ప్రాధాన్యత ఇస్తున్నట్లు జీవీఎంసీ కమిషనర్ కేతన్ గార్గ్ తెలిపారు. శనివారం ఆయన జీవీఎంసీ ప్రధాన కార్యాలయంలోని కమిషనర్ చాంబర్‌లో కమిషనర్‌గా బాధ్యతలను స్వీకరించిన అనంతరం పాత్రికేయుల సమావేశం నిర్వహించారు. ఈ ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ, ప్రజలకు అవసరమయ్యే మౌలిక వసతుల కల్పనలో భాగంగా తాగునీరు, వీధి దీపాలు, కాలువలు, రోడ్లు వంటి వాటికి ప్రాధాన్యత కల్పిస్తామని పేర్కొన్నారు. జీవీఎంసీ, రాష్ట్ర, కేంద్ర ప్రభుత్వాల నిధులు సక్రమంగా ఉపయోగించి విశాఖ నగరాన్ని అభివృద్ధి చేసేందుకు ప్రజాప్రతినిధులు, కౌన్సిల్, మేయర్, కార్పొరేటర్ల సలహాలు, సూచనలు పరిగణనలోనికి తీసుకుంటామని తెలిపారు. రానున్న స్వచ్ఛ సర్వేక్షన్‌లో విశాఖ దేశంలోనే ఉత్తమ ర్యాంకు సాధించేందుకు అందరి సహకారంతో కృషి చేస్తానన్నారు. విశాఖ అభివృద్ధి దిశగా డిపిఆర్ ప్రకారం ప్రతిపాదిత మెట్రో ప్రాజెక్టులు, ఫ్లై ఓవర్లకు జీవీఎంసీ తరపున సహకారం అందిస్తానని తెలిపారు. నగరంలో గల ఖాళీ స్థలాలను సుందరంగా తీర్చిదిద్ది అభివృద్ధి చేస్తామని, పార్కులు, కూడళ్ళు అభివృద్ధి చేసి ప్రజలకు అందుబాటులోకి తీసుకువస్తామన్నారు. భూగర్భ డ్రైనేజీ వ్యవస్థ పనులు త్వరితగతిన పూర్తయ్యేలా చూస్తామన్నారు. మురుగు నీటి కాలువలలో క్రాసింగ్ నుండి తాగునీటి పైపులు వెళ్లడంతో నీరు కలుషితం కాకుండా వాటిని క్రమబద్ధీకరిస్తామని తెలిపారు. వర్షాకాలం దృష్ట్యా ప్రధాన కాలువలలోని వ్యర్థాలు తొలగించేలా చర్యలు చేపడతామని, సీజనల్ వ్యాధులైన మలేరియా, డెంగ్యూ జ్వరాలపై సీజనల్ సర్వే నిర్వహిస్తామని తెలిపారు. ప్రజల్లో అవగాహన కార్యక్రమాలు చేపట్టి దోమల నివారణకు ఫాగింగ్, స్ప్రేయింగ్, సీడ్ బాల్స్ వెదజల్లడం తదితర దోమల నియంత్రణ కార్యక్రమాలను చేపడతామన్నారు. పాత నగరంలోని కొన్ని సమస్యలు ఉన్నాయని వాటిని ప్రజలు ,స్థానిక ప్రజాప్రతినిధుల సహకారంతో పరిష్కారానికి కృషి చేస్తానన్నారు. రోడ్ల అభివృద్ధిపై సర్వే నిర్వహిస్తామని అడ్డంకులు ఉంటే న్యాయపరంగా వాటిని పరిష్కరిస్తామని, బిల్డింగ్ రెగ్యులరైజేషన్ ప్రక్రియను పూర్తి చేస్తామని తెలిపారు. నగరంలో సీసీ కెమెరాలు నిఘా వ్యవస్థను పోలీస్ డిపార్ట్మెంట్, జీవీఎంసీ సమన్వయంతో నిర్వహిస్తామన్నారు. కోస్టల్ సిటీ విశాఖ నగరాన్ని మరింత సుందరంగా తీర్చిదిద్ది అభివృద్ధికి కృషి చేస్తానన్నారు.



ఈ పాస్ మిషన్ల పనితీరుపై స్పెషల్ డ్రైవ్

-26నుంచి వృద్ధులు, వికలాంగుల ఇంటి వద్ద బియ్యం పంపిణీ చేయాలి
-విజన్ టెక్ కంపెనీ జిల్లా కోఆర్డినేటర్ సోమేశ్వరరావు

ప్రజాశక్తి- రావికమతం:జిల్లా పౌరసరఫరాల శాఖ అధికారి ఆదేశాల మేరకు రావికమతం పౌర సరఫరాల శాఖ విజన్ టెక్ కంపెనీ జిల్లా కోఆర్డినేటర్ ఎన్. సోమేశ్వరరావు ఆధ్వర్యంలో శనివారం ఈ పాస్ మిషన్లు, తూనిక యంత్రాల పనితీరు, మరమ్మత్తులపై స్పెషల్ డ్రైవ్ నిర్వహించారు. రావికమతం పౌరసరఫరాల శాఖ గోదాం వద్ద ప్రత్యేక శిబిరం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా సోమేశ్వరరావు మాట్లాడుతూ, రావికమతం మండలంలో 52 రేషన్ డిపోలు, బుచ్చయ్యపేట మండలంలో 48 డిపోలకు సంబంధించిన రేషన్ డీలర్లు ఈ శిబిరానికి హాజరయ్యారన్నారు. ఈ పాస్ మిషన్లకు, వ్యక్తిగత మొబైల్‌కు బ్లూటూత్ ద్వారా లింక్ చేయడం జరిగిందన్నారు. ఈ పాస్ మిషన్‌కు కాటాకు లింకు పెట్టి బియ్యం పంపిణీ చేయాలని ఆయన ఆదేశించారు. ఈనెల 26 నుంచి 30 వరకు దివ్యాంగులకు, వృద్ధుల ఇంటింటికి వెళ్లి బియ్యం పంపిణీ చేయాలన్నారు. ప్రభుత్వం నిర్దేశించిన విధంగా జూలై 1 నుండి 15 వరకు రేషన్ కార్డు లబ్ధిదారులకు డిపో వద్ద సరుకులు పంపిణీ జరగాలన్నారు. విధి నిర్వహణలో ఎటువంటి అలసత్వం వహించినా, అవకతవకలకు పాల్పడిన వారిపై చర్యలు తప్పవని వారు హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో పౌర సరఫరాల శాఖ అధికారులు, డీలర్లు పలువురు పాల్గొన్నారు.



మిషన్లను పరిశీలిస్తున్న జిల్లా కో-ఆర్డినేటర్



సమ్మె స్టిక్కర్లను ఆవిష్కరిస్తున్న కుమార్ తదితరులు

జాతీయ సమ్మెను జయప్రదం చేయండి

- సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి ఆర్‌కెఎస్‌వి.కుమార్

ప్రజాశక్తి- విశాఖ కలెక్టరేట్:కేంద్ర బిజెపి ప్రభుత్వం తెచ్చిన లేబర్ కోడ్స్‌ను రద్దు చేయాలని, కార్మికవర్గం తక్షణ సమస్యలు పరిష్కారానికి జూలై 9న జరిగే అఖిల భారత సమ్మెను విజయవంతం చేయాలని కార్మిక వర్గానికి సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి ఆర్.కె.ఎస్.వి.కుమార్ పిలుపునిచ్చారు. శనివారం జగదాంబ సిఐటియు కార్యాలయంలో సార్వత్రిక సమ్మె స్టిక్కర్‌ను విడుదల చేశారు. ఈ సందర్భంగా కుమార్ మాట్లాడుతూ, కార్మికులకు అనుకూలంగా చట్టాలు, హక్కులు వున్నప్పుడే కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అమలు చేయడం లేదని, లేబర్ కోడ్స్ అమలయితే కార్మికులకుండే కొద్దిపాటి హక్కులు కూడా కోల్పోవాల్సి వస్తుందన్నారు. బహుళజాతి సంస్థలు రావడంతో కళాసీలకు ఉపాధి లేకుండా పోతుందన్నారు. వీరి సంక్షేమానికి ప్రభుత్వాలు నిధులు కేటాయించి వెల్ఫేర్ బోర్డు ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. లేబర్ కోడ్స్ రద్దు, కనీస వేతనాలు అమలు కోసం ఈ సమ్మె జరుగుతుందని, కార్మికులంతా పాల్గొనాలని కోరారు. ఈ కార్యక్రమంలో విశాఖ జిల్లా నాయకులు ఎం.సుబ్బారావు, వై.రాజు, ఆర్.ఎస్.ఎన్.మూర్తి, ఎం.రాంబాబు, ఎం.సూరీడులు పాల్గొన్నారు.